
ఆంధ్రజ్యోతి

5



ANDHRAJYOTHY

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 17 మే 2024

'స్ట్రాంగ్ రూమ్'కు మూడంచెల భద్రత

నెల్లూరు (క్రైం) మే 16 : నెల్లూరు శివార్లలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలకు మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు కె ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతా చర్యలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. 24 గంటలపాటు పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు బందోబస్తు విధుల్లో ఉంటాయని తెలిపారు. అంతేగాక సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.





బుచ్చిరెడ్డిపాళెంలో గురువారం ఉదయం కురుస్తున్న వర్షం

కరిమబ్బులు కమ్మిన వేళ..

• జిల్లాలో అక్కడక్కడా వర్షం • చల్లబడిన వాతావరణం • రైతన్నల ఆనందం

నెల్లూరు నగరాన్ని కరిమబ్బులు కమ్మేశాయి. భగభగ మండుతున్న భానుడిని మింగేశాయి. ఉక్కపోతతో అల్లాడిన ప్రజానీకంలో ఆహ్లాదం నింపాయి. గురువారం ఉదయం జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుచ్చిరెడ్డిపాళెం, లింగసముద్రం, ఉదయగిరి, ఏఎస్‌పేట తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు పారింది. భగ్గుమన్న భానుడి దెబ్బకు తడారిన నేలకు ఈ వర్షం సాంత్వన చేకూరినట్టు అయింది. మరోవైపు రెండోకారుకు సిద్ధం అవుతున్న అన్నదాతలోనూ ఆశలు చిగురింపచేసినట్టు అయింది.



ఇందుకూరుపేట : పల్లిపాడు రీచ్ వద్ద పెన్నాలో ఇసుక తవ్వకాలతో ఏర్పడ్డ భారీ గుంతలు

జిల్లాలో అన్ని ఇసుక రీచ్‌లను పరిశీలించాం. ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగడం లేదు. భారీ యంత్రాలతో తవ్వకాలు జరిపిన ఆనవాళ్లూ కనిపించలేదు.

- ఎన్జీటీకి కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఇది

రీచ్‌లు ఉన్న ప్రాంతాల్లో భారీ గుంతలు కనిపిస్తున్నాయి. ఇసుకను తవ్వినట్లు స్పష్టంగా తెలుస్తోంది. యార్డుల్లో భారీ ఇసుక డంప్‌లు కొనసాగుతున్నాయి. నిత్యం విక్రయాలు జరుగుతున్నాయి.

- ఇదీ క్షేత్రస్థాయిలో పరిస్థితి

ఇసుక తవ్వకాలే లేనప్పుడు

ఈ గుంతలు ఎక్కడివి!?

- మరి జిల్లాలో వినియోగిస్తున్న ఇసుకంతా ఎక్కడిది..?
- ఎన్జీటీకి కలెక్టర్ ఇచ్చిన నివేదికపై సర్వత్రా చర్చ
- పెన్నాలో స్పష్టంగా కనిపిస్తున్న భారీ గుంతలు

జిల్లాలో అసలు ఇసుక తవ్వకాలే జరగట్లేదట! అన్ని రీచ్‌లను పరిశీలించగా భారీ యంత్రాలతో ఎక్కడా తవ్వకాలు జరుగుతున్న ఆనవాళ్లు కనిపించలేదట! ఇది ఎవరో చెప్పిన మాట కాదు. సాక్షాత్తూ జిల్లా పాలనాధికారి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు (ఎన్జీటీ) ఇచ్చిన నివేదికలోని సారాంశం. ఫిబ్రవరి 11-14వ తేదీల మధ్యలో రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్, ఆ నివేదికను ఎన్జీటీకి అందజేశారు. అప్పటికే ఇసుక తవ్వకాలు అసలు జరగట్లేదని కలెక్టర్ నిర్ధారించారు. కలెక్టర్ నివేదిక ప్రకారం గడిచిన నాలుగు నెలలుగా జిల్లాలో ఇసుక తవ్వకాలు జరగడం లేదు. అయితే ప్రస్తుతం జిల్లాలో వినియోగిస్తున్న ఇసుకంతా ఎక్కడిది? అన్న ప్రశ్నకు కూడా అధికారులే సమాధానం చెప్పాలి. రీచ్‌లు ఉన్న ప్రాంతాల్లో పెన్నా నదిలో పరిశీలిస్తే భారీ గుంతలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ ఇటీవల తవ్వకాలతో ఏర్పడ్డ గుంతలని వాటిని చూస్తేనే అర్థమవుతోంది. ఈ గుంతలు ఎవరు పెట్టారు? అన్న ప్రశ్నకు కూడా అధికారులే సమాధానం ఇవ్వాలి. అసలు ఇసుక తవ్వకాలే జరగనప్పుడు ఇంత భారీ గుంతలు ఎలా ఏర్పడ్డాయోనని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ రీచ్‌ల ఒడ్డున దర్జాగా యార్డుల పేరుతో ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. మరి జిల్లాలో రీచ్‌లకు అనుమతులు లేనప్పుడు.. కలెక్టర్ నివేదిక ప్రకారం నాలుగైదు నెలల నుంచి అసలు తవ్వకాలే జరగనప్పుడు.. ఈ యార్డుల్లోకి ఇసుక ఎలా వచ్చిందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ యార్డులన్నిటినీ ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఏపీఎండీసీ ఈ యార్డులను ఏర్పాటు చేసింది. అటువంటప్పుడు ఆ యార్డులను ప్రస్తుత కాంట్రాక్టర్ ఎలా వినియోగిస్తున్నారో అర్థం కావడం లేదు. అసలు తవ్వకాలకే అనుమతులు లేనప్పుడు యార్డుల్లో ఇసుకకు అనుమతులు ఎవరిచ్చారన్నది కూడా అనుమానంగా మారింది. ఒకవేళ యార్డులకు అనుమతులు ఉన్నాయనుకున్నా కలెక్టర్ నివేదిక ప్రకారం నాలుగైదు నెలల నుంచి ఈ యార్డుల్లోని ఇసుక నిత్యం విక్రయాలు జరుపుతున్నా ఇంకా కరగడం లేదు. మినగల్లు, పల్లిపాడు రీచ్‌ల వద్ద ఉన్న యార్డుల్లో భారీ డంప్‌లు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. తెల్లకాగితాలపై బిల్లులు ప్రింట్ చేసి విక్రయాలు జరుపుతున్నారు. అసలు ఈ యార్డుల్లో ఎంత నిల్వ ఉంది..? ఎప్పటి నుంచి నిల్వ ఉంది..? ఎంత విక్రయాలు జరిపారు..? అన్న వాటికి అధికారుల వద్ద లెక్కలు లేవు. గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు పల్లిపాడు, మినగల్లు రీచ్‌లను పరిశీలించేందుకు వెళ్లగా అక్కడ ఉన్న కొంతమంది బెదిరింపులకు దిగడం గమనార్హం. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన యార్డులోకి అసలు మీరెలా వస్తారంటూ అడ్డుకోవడమే కాకుండా జూన్ 4 తర్వాత తేలుస్తాం.. అంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడటం అక్కడ పరిస్థితికి అద్దం పడుతోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు ముగిశాయి.. ఇక సేద్యం పనులు షురూ!

• ఎడగారు సాగుకు రైతన్నల సన్నద్ధం

• జోరుగా దుక్కులు, నారుమళ్లు

సంగం, మే 16 : మొన్నటిదాకా పల్లెసీమలో ఎన్నికల హడావుడిలో ఉన్న రైతులు ఆ అంకం ముగియడంతో ఇక సాగుకు సన్నద్ధమవుతున్నారు. రబీ సీజన్ ముగియడంతోనే ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఈసారి జలాశయాల్లో నీటి లభ్యత లేకపోయినా మోటారు ఆయకట్టులో రైతులు ఎడగారు సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు నారుమళ్లు వేయగా, మరికొందరు దుక్కులు సిద్ధం చేస్తూ వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. సంగం, సిద్దీపురం, వెంగారెడ్డిపాళెం, అనసూయనగర్, మక్తాపురం, అన్నారెడ్డిపాళెం, దువ్వూరు గ్రామాల్లో మోటారు రైతులు నారుమళ్లు వేసి దుక్కులు సిద్ధం చేస్తున్నారు. సుమారు 2 వేల ఎకరాల్లో సాగుకు సన్నాహాలు చేస్తున్నారు.

• **ఆశాజనకంగా ధరలు**

గడిచిన సీజన్‌లో ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉండటంతో దిగుబడులు తగ్గినా మంచి గిట్టుబాటు కలిగింది. 850 కేజీల పుట్టి ధాన్యం మొదట్లో రూ.24 వేల వరకు పలికింది. ప్రభుత్వ మద్దతు ధరకంటే ప్రైవేట్ మార్కెట్‌లో ధాన్యం ధర ఎక్కువే ఉంది. ఎకరాకు కనీసం మూడు పుట్ల ధాన్యం ఖర్చులకు పోయినా ఒక పుట్టి మిగలడంతో సుమారు రూ.24 వేల వరకు మిగిలింది. దీంతో ప్రస్తుతం ఎడగారు వరి పంటకు సన్నాహాలు చేస్తున్నారు. తక్కువ కాల వ్యవధిలో పండే ఎన్ఎల్ఆర్ 34449 (నెల్లూరు మసూరి ధాన్యం), ఎంటీయూ 1010 రకం ధాన్యం సాగు చేస్తున్నారు. ఇది తెగుళ్లకు, ఎండకు తట్టుకుంటుంది. అంతేగాక ధాన్యం ధర కూడా ఆశాజనకంగా ఉంటుంది. దుక్కులు దున్ని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మరికొంత మంది రైతులు ఇప్పుడు నారుమళ్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మొన్నటిదాకా ఎన్నికల్లో రాజకీయ పార్టీల తరఫున ప్రచారాల్లో పాల్గొన్న వ్యవసాయ కూలీలు కూడా వ్యవసాయ పనులకు వెళుతున్నారు.



నీటి లభ్యత మేరకే సాగు చేయాలి

ప్రస్తుతం తొమ్మిది గంటలకు బదులు ఏడు గంటలే కరెంటు సరఫరా వస్తోంది. మోటారు కింద ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తే నీటి సరఫరా కష్టమై పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగు చేపట్టాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మోటారు కింద వరి సాగు చేసే రైతులు ఒక మోటారుకు ఎకరా, రెండు ఎకరాలు మాత్రమే సాగు చేయాలి.

- శ్రీహరి, వ్యవసాయాధికారి, సంగం

ఎవరి లెక్కలు వారివే!

• పోలింగ్ సరళిపై ప్రధాన పార్టీల ఆరా • బూత్‌ల వారీగా నేతల విశ్లేషణ

• ఎన్డీఏ కూటమివైపే అన్ని వర్గాలు • మెజారిటీలపై అభ్యర్థుల మల్లగుల్లాలు


"గతంకన్నా ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. ఇది మాకు బాగా లాభిస్తుంది. ఫలానా బూత్‌లో ఓట్లు బాగా పడ్డాయి. ఆ వైపు ఉన్నవారంతా మా వారే. ఇక మా గెలుపు నల్లేరుమీద నడకే!" ఇది ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకుల ధీమా. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ముగిసి మూడు రోజులు గడుస్తున్నా గెలుపోటములపై అభ్యర్థులు ఎవరికివారుగా లెక్కలు వేసుకుంటున్నారు. ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఎన్డీఏ కూటమివైపే ఉన్నా వైసీపీ నాయకులు మాత్రం ఈసారి కూడా అధికారం తమదేనంటున్నారు. జిల్లాలో పోల్ అయిన ఓట్ల వివరాలను బూత్‌ల వారీగా తెప్పించుకుని రాజకీయ విశ్లేషకుల ద్వారా ఆరా తీస్తున్నారు.

నెల్లూరు (జడ్పీ), మే 16 : ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. అలాగే గతంలో కంటే ఈసారి ఓటింగ్ శాతం పెరగడంతో తమకే లాభిస్తుందని ప్రధాన రాజకీయ పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల షెడ్యూలు విడుదలైన నాటినుంచే ఎలాగైనా గెలవాలన్న ఆలోచనతో ప్రధాన పార్టీల అభ్యర్థులు సర్వశక్తులూ ఒడ్డారు. వ్యూహ రచనతోపాటు ధన బలాన్ని ప్రదర్శించి ఎక్కడా వెనుకబడకుండా పోటాపోటీగా ప్రచారాలు చేశారు. అందుకు అనుగుణంగానే ఈ నెల 13వ తేదీన ఓటర్లు సైతం భారీగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకొన్నారు. తెల్లవారుజాము వరకు క్యూలైన్లలో వేచి ఉండి మరీ ఓటు వేశారు. ఈ ప్రక్రియ ముగి యడంతో అభ్యర్థులంతా ఓటింగ్ సరళి, పోలింగ్ శాతంపై మునిగి తేలుతున్నారు. బూత్‌ల వారీగా ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయన్న దానిపై లెక్కలు వేసుకుంటూ గెలుపు, మెజారిటీలపై ధీమా వ్యక్తం చేసుకుంటున్నారు.

• **ఏజెంట్లతో సమాలోచనలు**

పోలింగ్ సరళి ఎలా జరిగింది? ఓటరు మనోగతం ఎలా ఉంది? ఎవరికి ఎక్కువ ఓట్లు పడి ఉంటాయనే విషయాలపై అభ్యర్థులు, పార్టీ ముఖ్య నేతలు బూత్‌ల వారీగా ఏజంట్లతో సమావేశాలు నిర్వహించుకుంటూ ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్నారు. బూత్‌ల వారీగా తమకు ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయి? ఏ ప్రాంతం ఓటర్లు తమకు అనుకూలంగా ఉన్నారు? ఏ ఏ బూత్‌లలో ఎంత మెజారిటీ వచ్చే అవకాశం ఉంది తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. ఓటింగ్ సరళిని బట్టి ప్రతి బూత్‌లోనూ మనకు ఇంత మెజారిటీ ఉంటుందని ఏజెంట్లు లెక్కలు గట్టి అభ్యర్థులకు నివేదికలు ఇస్తున్నారు. అయితే అరకొర బూత్‌లలో తక్కువగా, సమానంగా ఓట్లు పడినా ఎక్కువ బూత్‌ల్లో తమదే అధిక్యమంటూ ఏజెంట్లు లెక్కలు అందజేస్తుండటంతో దానిని బట్టి గెలుపుతోపాటు మెజార్టీ ఎంత వస్తుందన్న అంచనాల్లో అభ్యర్థులు ఉంటున్నారు. అలాగే ఎక్కడైనా క్రాస్ ఓటింగ్ జరిగిందా!? ఇచ్చిన డబ్బులకు వ్యతిరేకంగా ఎక్కడైనా ఓట్లు పడ్డాయా!? అనే అంశాలపైనా క్షుణ్ణంగా ఆరా తీస్తున్నారు. అయితే ఒక నియోజకవర్గంలో గెలిచేది ఒకరే అయినప్పటికీ ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమదే గెలుపంటూ లెక్కలు వేసుకొని కేడర్‌లో ఉత్సాహం నింపుతున్నారు. దీంతో నేతలు కూడా గెలుపు తమ నేతదేనంటూ ముందుగానే ఆనందాలు వ్యక్తం చేసుకుంటూ భారీగా పందేలు కడుతున్నారు.

• **ఉదయగిరి :** మండలాలు, గ్రామాల వారీగా పోలైన ఓట్లు ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చే అవకాశం ఉందనే దానిపై ఆరాతీస్తూ ప్రధాన పార్టీల నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. ఉదయగిరి నుంచి 15 మంది ఎన్నికల బరిలో ఉండగా ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీల మధ్యనే పోటీ నెలకొంది. అయితే, ప్రభుత్వంపై వ్యతిరేకత, అక్రమాలు, అవినీతి, టీడీపీ మ్యానిఫెస్టో ప్రజలను బాగా ఆకర్షించిందని ఇదే తమకు గెలుపును అందిస్తాయని టీడీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్న ధీమాలో వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు.



ఆత్మకూరులో ఎవరికివారుగా..

ఆత్మకూరు : నియోజకవర్గంలో హోరాహోరీ పోరు నెలకొనడంతో గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. పోలింగ్ సరళిని బట్టి తమ ప్రయత్నాలు ఎంతవరకు ఫలించాయో సమీకరణలు చేసుకోవడంలో తలమునకలు అవుతున్నారు. ఓటరు అంతుపట్టని విధంగా వ్యవహరించటంతో నాయకులు తమ పార్టీ అభ్యర్థికే మెజారిటీ వస్తుందని లెక్కలు వేస్తూ సంతృప్తి చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, టీడీపీ సూపర్ సిక్స్ ఉమ్మడి మ్యానిఫెస్టో తమకు అనుకూలిస్తాయని టీడీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. ఇక వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి సొంత మండలం మర్రిపాడులోనే ఎదురు గాలి వీయడం, వైసీపీకి కంచుకోటగా ఉన్న అనంతసాగరం మండలంలో ఆధిక్యతకు గండి పడే అవకాశాలు ఉండటం, అనూహ్యంగా టీడీపీకి సానుకూల పవనాలు వీచాయని టీడీపీ నేతలు అంచనాలు వేస్తున్నారు. వైసీపీ నేతలు సైతం గెలుపు తమదేననే ధీమాను వ్యక్తపరుస్తూ లెక్కలు కట్టే పనిలో పడ్డారు. ఓటింగ్ సరళిని బట్టి తాము విజయం సాధించి తీరుతామని వారు విశ్లేషిస్తున్నారు.

ఎవరికి వారుగా అంచనాలు

కందుకూరు : విజయావకాశాలపై ఎడతెగకుండా కూడికలు.. తీసివేతలలో నేతలు తల మునకలై ఉన్నారు. తొలిరోజు ఒక అంచనాతో లెక్కలు వేసుకున్న నేతలు మరుసటిరోజుకి క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి అంచనాలు మార్చి లెక్కలు వేయటం మూడవరోజు మరికొన్ని మార్పులు చేర్పులతో అంచనాలు రూపొందించడంతో రోజుకొక అంచనా బయటకు వస్తోంది. భారీ మెజారిటీతో విజయం సాధిస్తామన్న ధీమా అభ్యర్థుల్లోను లేదనేది సుస్పష్టమైనా ఒకటి ఒకటిన్నర శాతం ఓట్లు ఆధిక్యతతో గెలుపు ఖాయమని ఎవరికి వారే ఢంకా బజాయిస్తూ విశ్లేషణలు బయటకు తెస్తున్నారు.

త్రిముఖపోరులో ఎవరిదో విజయం

కావలి : కావలిలో జరిగిన త్రిముఖపోరులో విజయం ఎవరిని వరిస్తుందోనని అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఎన్డీఏ కూటమి తర పున కావ్యకృష్ణారెడ్డి, వైసీపీ తరఫున ప్రతాప్‌కుమార్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్‌ల మధ్యే పోటీ నెలకొంది. రాష్ట్ర ప్ర భుత్వంపై ఉన్న వ్యతిరేకత, ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి అవినీతి, అరాచకాలతో ఆయనపై ఉన్న వ్యతిరేకత టీడీపీకి అనుకూలంగా ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అలాగే కావలిలో కమ్మ, బలిజ, వైశ్య సామాజిక వర్గాలు పూర్తిగా టీడీపీ వైపు ఉన్నాయంటు న్నారు. అంతేగాక వ్యాపార వర్గాలు, రైతులు, యువత, నిరుద్యోగు లు కూడా తమవైపే నిలిచి ఓట్లు వేశారని టీడీపీ నాయకులు ఆశగా ఉన్నారు. ఇక కావలి నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే విస్మరించడం కూడా వైసీపీ ఓటు బ్యాంకుకు నష్టం కలిగిస్తుందని అంటున్నారు. ఏదిఏమైనా ఈసారి తమ గెలుపు నల్లేరుమీద నడకేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక వైసీపీ నాయకులు సంక్షేమ పథకాలపైనే ఆశలు పెట్టుకుని ఉన్నారు. మరోవైపు ఓటింగ్ శాతం పెరిగినందున మహిళలు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారని ఇది తమకు లాభిస్తుందని అంటున్నారు. మరోవైపు బీసీలు అధికంగా ఉన్న కావలి నియోజకవర్గంలో బీసీ అభ్యర్థినైన తనను ఆదరిస్తారని స్వతంత్ర అభ్యర్థి సుధాకర్ కూడా ధీమాగా ఉన్నారు. మొత్తానికి ఈ త్రిముఖ పోరులో విజయం ఎవరిదో వచ్చే నాల్గవ తేదీన తేలిపోనుంది.

ఆటో బోల్తా : అంధుడి మృతి

- మరొకరికి గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన నాగేంద్ర

నెల్లూరు(క్రైం). మే 16: ఆటో బోల్తాపడి ఓ అంధుడు మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి.ఈ ఘటన ఆర్టీసీ కాలనీ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, వెంకటాచలం మండలం పూడిపర్తి గ్రామానికి చెందిన పీ నాగేంద్ర(31) అంధుడు. ఆయన అంధుల బ్యాండ్‌కు మైక్ సెట్టింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయనకు ఇంకా పెళ్లి కాలేదు. నాగేంద్రకు టీపీగూడూరు మండలం కొత్తపాలెంకు చెందిన జిలానీబాషా స్నేహితుడు. ఇద్దరు కలిసి గురువారం తల్పగిరికాలనీలోని స్నేహ చారిటబుల్ ట్రస్టు మేనేజర్‌ను కలిసేందుకు నెల్లూరుకి వచ్చారు. ఆర్టీసీ కాలనీ సమీపంలో బస్సుదిగి తల్పగిరి కాలనీకు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. డ్రైవర్‌గా ఉన్న బాలుడు మితిమీరినవేగంతో ఆటో నడుపుతూ వేగాన్ని నియంత్రించలేకపోవడంతో చంద్రబాబునగర్‌కు వెళ్లే మలుపు వద్ద బోల్తా పడింది. ఆటోలో ఉన్న నాగేంద్ర తలపై ఆటోపడడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. జిలానీకి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సౌత్‌ట్రాఫిక్ ఎస్‌ఐ కిశోర్‌బాబు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు నమోదు చేశారు. ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్‌ఐ కిశోర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుడిపల్లిపాడులో అనుమానాస్పదంగా వివాహిత..

నెల్లూరు(రూరల్). మే 16: నెల్లూరు రూరల్ మండల పరిధిలోని గుడిపల్లిపాడులో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది.ఈ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసుల కథనం మేరకు, గుడిపల్లిపాడు బలరామపురంలో నివాసం ఉంటున్న ఆదిపూల లక్ష్మమ్మ(43) తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని స్థానికుల ద్వారా పోలీసులు గుర్తించారు. ఆమెకు 20 ఏళ్ల క్రితం వెంకటేశ్వర్లుతో వివాహమైంది. అనివార్య కారణాల వల్ల మొదటి భర్తను వదిలి మరో వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అతను ఆరు నెలల క్రితం మృతి చెందాడు. కాగా ఇటీవల జరిగిన ఎన్నికలకు ఓటు వేసేందుకు వచ్చిన మొదటి భర్త వెంకటేశ్వర్లు పెద్దమనుషుల సమక్షంలో రాజీ కుదుర్చుకొని ఆమెతో సంసారం చేసేందుకు అంగీకరించాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇరువురు ఒకే గదిలో నిద్రించగా, తెల్లవారే సరికి లక్ష్మమ్మ మరణించి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. భర్త వెంకటేశ్వర్లు కనిపించకపోవడంతో తొలుత ఆమెను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానించారు. కాగా పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక ప్రకారం హత్య కాదని నిర్ధారించుకుని, అనుమానాస్పద మృతి కింత కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు..

- మరొకరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వర్లు

సంగం, మే 16: మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మర్రిపాడు మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (30) మోటారు బైక్‌పై నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో కావలి కాలువ సమీపంలో ముంబాయి జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని మోటారు బైక్ ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు తలకు తీవ్రగాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అదేవిధంగా సంగం గ్రామానికి చెందిన షేక్ ఆయేషా అలియాస్ విజయలక్ష్మి అనే మహిళ ఆటోలో సంగం వస్తుండగా, దువ్వూరు వద్ద ముంబాయి జాతీయ రహదారి ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న షేక్ ఆయేషా అలియాస్ విజయలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు మహిళను బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆలయాల్లో చోరీయత్నం



చోరీ యత్నం జరిగిన ఆలయాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి

సంగం, మే 16: స్థానిక పోలేరమ్మ, గంగమ్మ ఆలయాల్లో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ యత్నానికి పాల్పడ్డారు. వివరాల మేరకు రోజు మాదిరిగానే బుధవారం రాత్రి పూజారులు తాళాలు వేసుకుని ఇంటికి వెళ్లారు. ఈ రెండు ఆలయాలు పెన్నానది ఓడ్డున ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ముందుగా సీసీ కెమెరాలను పగలగొట్టారు. తర్వాత మొదట పోలేరమ్మ ఆలయం తలుపు తాళం పగల గొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ హుండీ లేకపోవడంతో గంగమ్మ ఆలయం ఉత్తరం వైపు ఉన్న తాళం పగల గొట్టే ప్రయత్నం చేశారు. దాని గేటు రాకుండా హెల్డింగ్ చేసి ఉండడంతో గేటుకు కట్టిన రేకు ఊడదీసి బయట నుంచే లోపలికి చూశారు. లోపల హుండీకి తాళం వేయకుండా ఉండడంతో నగదు ఉండదని భావించి వెనుతిరిగారు. గురువారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి తాళం పగల గొట్టి ఉండడం చూసి గ్రామ పెద్దలకు తెలిపారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ నాగార్జునరెడ్డి ఆలయానికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరా పగల గొట్టి ఉండడంతో చోరీ యత్నానికి పాల్పడిన వారిని గుర్తించేందుకు బస్టాండ్ కూడలిలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తునారు.


కారును ఢీకొన్న ఆటో

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మే 16: మండలంలోని వెంకటంపేట గ్రామ సమీపంలో ఎస్‌ఐ కారును ఆటో ఢీకొన్న సంఘటన గురువారం చోటు చేసుకొంది. వివరాల మేరకు ఉదయగిరి ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో నెల్లూరుకు వస్తుండగా, అదే మార్గంలో వెంకటంపేట గ్రామం నుంచి ఉదయగిరికి వస్తున్న ప్రయాణికుల ఆటో ప్రమాదవశాత్తు కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

పిడుగుపడి జీవాల దుర్మరణం

- త్రుటిలో కాపరులకు తప్పిన ప్రమాదం

ఏఎస్‌పేట, మే 16: ఉరు ములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పాటు పిడుగు పడడంతో 8 జీవాలు మృతి చెంది, పశువుల కాపరులు ప్రమా దం నుంచి తప్పించుకున్న సంఘటన గురువారం ఏఎస్ పేట మండలం చౌటభీమవరంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు గ్రామానికి చెందిన క్రిష్ణయ్య, హజరత్తయ్య, చిన్నయ్య గొర్రెలు, మేకలను మేపు కుంటూ అడవిలోకి వెళ్లారు. ఉన్నట్లుండి మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో మేకలు, గొర్రెలను ఓ మర్రి చెట్టు కిందకు తోలారు. పశువుల కాపరులు మాత్రం కొంత దూరంలో ఉన్న వేప చెట్టు కిందకు వెళ్లి తల దాచుకున్నారు. ఇంతలో పెద్ద శబ్దంతో మర్రిచెట్టుపై పిడుగు పడడంతో కొన్ని జీవాలు పరిగెత్తాయి. సుమారు ఎనిమిది జీవాలు మాత్రం అక్కడికక్కడే మృతి చెందాయి. వారు కూడా ఇక్కడే ఉండి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని వారు వాపోయారు. సుమా రు లక్ష రూపాయలు విలువైన జీవాలు మృతి చెందా యని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చౌటభీమవరంలో పిడుగు పడి మృతి చెందిన జీవాలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	172
లేయర్ లైవ్	107
స్కిన్ చికెన్	300
స్కిన్‌లెస్	330
లేయర్	182

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6988
వెండి కిలో ధర	రూ. 88,400
వెండి ఒక గ్రాము	రూ. 90.40


భయపెడుతున్న బీపీ !

- రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే..
- మెదడులో రక్తనాళాలు చిట్లే అవకాశం
- జిల్లాలో 4లక్షల మందికిపైగా వ్యాధిగ్రస్థులు
- నేడు వరల్డ్ హైపర్ టెన్షన్ డే

నెల్లూరు(వైద్యం) మే 16 : టెన్షన్ ... టెన్షన్.. ప్రస్తుతం సమాజంలో ఎక్కడికి వెళ్లినా.... ఎవరిని కదిలించినా ఇదే మాట వినిపిస్తున్నది. ఈ పరిస్థితిలో మనిషి మనుగడ ప్రశ్నార్థకరంగా మారుతోంది. ఒత్తిడితో అనేకమంది వ్యాధులకు గురవుతున్నారు. పనిలో వత్తిడి, చదువులోనూ ఒత్తిడితో పలు వ్యాధులకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో నరాల్లో పోటెత్తే నెత్తుటి వేగం అదుపుతప్పి రేకెత్తించే అలజడి. వైద్య పరిభాషలో చెప్పాలంటే దీన్ని హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు-బీపీ) అంటారు. రక్తపోటుపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆదిలోనే దీన్ని అదుపు చేయక పోతే ప్రాణాంతకంగా మారుతుంది. మధుమేహం తర్వాత ఎక్కువమందిని వేధించే సమస్య రక్తపోటు. ఈ వ్యాధి శరీమంతా వ్యాపించి ప్రధాన అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉన్నట్లు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. జిల్లాలో 4 లక్షల మందికిపైగా రక్తపోటు వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు తెలుస్తోంది. వయసుతో పనిలేకుండా వ్యాధిగ్రస్తులు ఉన్నారు. గతంలో 45 ఏళ్ల పైబడిన వారికి వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం అందరినీ పట్టి పీడిస్తుంది. మధుమేహం ఉన్న వారికి ఎక్కువగా రక్తపోటు వచ్చే అవకాశం ఉన్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే అది గుండెపోటుకు కూడా దారి తీసే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు.ఈ వ్యాధి వల్ల మూత్ర పిండాలు, కంటి జబ్బులు వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. అంతేకాక మెదడులో నరాలు చిట్లి ప్రాణాపాయానికి దారితీసే అవకాశం కూడా ఉందంటున్నారు. మే 17వ తేదీన (నేడు) ప్రపంచ రక్తపోటు దినోత్సవంగా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు నిచ్చింది.

- జిల్లాలో పరిస్థితిని పరిశీలిస్తే ...

జిల్లాలో రక్తపోటును పరిశీలిస్తే అనేక ప్రాంతాల్లో వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలోని 52 పీహెచ్‌సీల పరిధిలో 1.02 లక్షల మంది వరకు రక్తపోటు బాధితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే ప్రతి వందమందిలో 15 మంది వరకు గ్రామాల్లో వ్యాధిగ్రస్థులు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 20 మందికిపైగా నమోదవుతున్నారు. కొందరికి ఈ వ్యాధిపై అవగాహన లేక పోవడంతో తీవ్ర వ్యాధులకు గురవుతున్నట్లు తెలుస్తున్నది. ప్రతి ఒక్కరూ రక్తపోటు పరీక్షలు విధిగా చేయించుకుని తగిన చికిత్సలు చేయించుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ రక్తపోటు 120/80 ఉండాలి. అది అధిగమించితే వ్యాధి లక్షణాలు గుర్తించాల్సి ఉంటుంది.



నివారణ చర్యలు ఇలా...

- ఆహారంలో తీసుకునే రోజువారి ఉప్పు 5గ్రాముల కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో కొవ్వు పదార్థాలు పరిమితి మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- అధిక బరువు ఉన్నట్లయితే బరువు తగ్గేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఉండాలి.
- మద్యం తాగే అలవాటు ఉంటే మోతాదుమించకుండా చూసుకోవాలి.
- పొగ తాగే అలవాటు ఉంటే పూర్తిగా మానివేయాలి.
- రక్తపోటు ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలి.
- అధిక రక్తపోటు ఉన్నట్లయితే వైద్యుల సలహాపై మందులు క్రమతప్పకుండా వాడాలి.

రక్తపోటుతో తస్మాత్ జాగ్రత్త !



రక్తపోటు పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలి. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య చికిత్సలు చేయించుకోవాలి. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ఇది శరీరంలోని పలు అవయవాలపై తీవ్ర ప్రభావం చూపనున్నది. ప్రధానంగా కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒక్క సారి కిడ్నీ పని చేయక మరణించే అవకాశం ఉంది. దీర్ఘకాలకంగా బీపీ ఉండి నిర్లక్షం చేస్తే కిడ్నీలు దెబ్బతింటాయి. ఆకస్మికంగా వచ్చే హైబీపీని మందులతో నయంచేసుకునే అవకాశం ఉంది.

\- డాక్టర్ గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

బీపీ ప్రభావం ఎక్కువగా రక్తనాళాలపైనే...



బీపీ ప్రభావం వల్ల రక్తనాళాలు దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంది. రక్తపోటు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. అధిక రక్తపోటు వల్ల ఒక్కోసారి మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయి ప్రాణంపోయే పరిస్థితి ఏర్పడుతుంది. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి రక్తం సరఫరా ఆగిపోయి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బీపీ, షుగర్ వ్యాధుల పట్ల ముందుగానే తగిన చికిత్సలు చేయించుకోవాలి.

\- డాక్టర్ సంపత్‌కుమార్, న్యూరోఫిజిషియన్, నారాయణ ఆసుపత్రి

డెంగ్యూ నివారణ అందరి బాధ్యత

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య
- వ్యాధిపై నగరంలో అవగాహన ప్రదర్శన



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు (వైద్యం) మే 16 : డెంగ్యూ నివారణ అందరి బాధ్యతని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య అన్నారు. గురువారం నగరంలో డెంగ్యూ అవగాహన ప్రద ర్శన నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి బోసుబొమ్మ వరకు సాగిన ఈ ప్రదర్శనలో వైద్యాధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ప్రాణాంతక మని, ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు దోమ కాటుకు గురి కాకుండా చూసుకోవాలన్నారు. అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే నీటినిల్వలు లేకుండా ఎప్పటి కప్పుడు తొలగించటం ద్వారా దోమలు వృద్ధి చెందకుండా అరికట్టవచ్చన్నారు. డెంగ్యూ నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి దోమలపై ప్రజలలో అవగాహన కలిగిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం దోమల నివారణ - ఆరోగ్య సంరక్షణ ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డెమో శ్రీనివాసరావు, సబ్ యూనిట్ అధికారి నాగార్జునరావు, ప్రోగ్రాం అధికారులు, పీఎంపీ, ఆర్ఎంపీ అసోసియేషన్ సభ్యులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు డీఎంహెచ్‌వో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

అందరికీ ఒక లెక్క.. వైసీపీ నేతలది మరో లెక్క

- నాయకుల వాహనాలకు అల్లూరు పోలీస్ స్టేషన్‌లో పూర్తి రక్షణ
- ఇదీ అల్లూరు పోలీసుల తీరు



పోలీస్ స్టేషనులో కవర్ కప్పి ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్న వైసీపీ నేత వాహనం

అల్లూరు, మే 16 : సాధారణంగా పోలీసులు కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్ స్టేషనుకు తరలిస్తే కేసు పూర్తయ్యేంత వరకు స్టేషనులోనే ఉండాలి. ఎండకాదు, వానకాదు నీడ కాదు అవి అలా పడి ఉండాలి అంతే. కొన్ని వాహనాలు శిథిలమై ఎందుకూ పనికి రాకుండా పోయినవి కూడా కోకొల్లలు. అవి ఏ పార్టీకి చెందిన వాహనాలైనా సరే. కానీ అల్లూరు పోలీస్ స్టేషనులో వైసీపీ నాయకుల వాహనాలకు ఒక ప్రత్యేకత ఉంది. వైసీపీ నాయకుల వాహనాలు కేసుల్లో ఇరుక్కొని స్టేషనుకు తరలిస్తే వాటిని నీడపట్టున ఉంచి కవర్ కప్పి పూర్తి రక్షణలో ఉంచారు. సార్వత్రిక ఎన్నికల్లో అల్లూరు నుంచి కొంతమందిని తీసుకొని బీరంగుంటకు వెళ్లి అక్కడ స్థానికులపై దాడిచేయగా స్థానికులు ప్రతిఘటించడంతో స్కార్పియో వాహనం అక్కడే వదిలేసి ప్రాణభయంతో పలాయనం చిత్తగించడంతో స్థానికులు ఆగ్రహావేశాలతో కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై అల్లూరు పోలీసులు కేసు నమోదుచేసి సదరు కారును పోలీస్‌స్టేషనుకు తరలించారు. అన్ని వాహనాలు ఎలాపడితే అలా పడేసి ఉన్నాయి. కానీ ఈ వైసీపీ నాయకుడి వాహనం మాత్రం స్పెషల్. వాహనానికి కవర్ కప్పి జాగ్రత్తగా చూసుకుంటున్నారు. అక్కడకు వచ్చిన ప్రజలు ఈ తంతును చూసి ఔరా.. అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇది పోలీస్ స్టేషనా లేక వైసీపీ నాయకుల వాహనాల పార్కింగ్ ప్రదేశమా, తమ వాహనాలకు ఒక లెక్క.. వైసీపీ నాయకుల వాహనాలకు మరో లెక్కా అంటూ బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు తీవ్ర గాయాలు



రోడ్డు పై తీవ్రగాయాలతో అపస్మారక స్థితితో ఉన్న వెంకట్రావ్

కావలి రూరల్, మే 16: రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులో జరిగింది. స్థానికులు వివరాల మేరకు... 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లోని రక్షక్ వాహనం డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్రావ్ మధ్యాహ్నం భోజనానికి బైకుపై ఇంటికి వెళ్తుండగా బ్రిడ్జి డౌన్‌లో రాంగ్ రూట్‌లో వచ్చిన మరో బైక్ ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన వెంకట్రావ్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న రెండవ పట్టణ సీఐ కొండవీటి శ్రీనివాసరావు, సిబ్బంది ఆటోలో వెంకట్రావ్‌ను ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న 1వ పట్టణ సీఐ రాజేష్, ఎస్‌ఐ అంబేడ్కర్ వైద్యశాలకు వెళ్లి వెంకట్రావ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అపోలో వైద్యశాలకు తరలించారు. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), మే 16 : జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ క్రీడామైదానంలో శుక్రవారం(నేడు) సాయంత్రం 5 గంటలకు జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గాదం వాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2008 జనవరి ఒకటోతేదీ తరువాత జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు వయసు ధ్రువీకరణ పత్రాలతో మైదానానికి వచ్చి సీనియర్ క్రీడాకారులు వి.చైతన్య సమంత కుమార్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు విజయవాడలోని స్టెల్లా మేరీ కళాశాలలో ఈనెల 21 నుంచి 24వతేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి 7వ యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు ఫోన్ 944 0879884 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అల్లూరు, మే 16 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన అల్లూరు మండలం బోడిసత్రం వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... కావలికి చెందిన శీనయ్య ద్విచక్ర వాహనంపై నార్తుమోపూరు నుండి అల్లూరు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో హఠాత్తుగా వాహనానికి అడ్డుగా వచ్చిన గేదెను ఢీకొని పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

అక్రమ మైనింగ్‌పై అధికారుల దాడులు

సైదాపురం,మే16: మండల పరిధిలోని తుమ్మలతలపూరు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓపెన్ క్వారీలపై మైనింగ్ శాఖ అధికారులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. మైనింగ్‌శాఖ డీడీ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ రెండు హిటాచీ మిషన్లు, మూడు టిప్పర్లు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం జరిగిందన్నారు. వైసీపీ నాయకుల నుంచి అధికారులకు ఫోన్లు వచ్చినా వాహనాలను స్టేషన్‌లో అప్పగించారు.

దొంగతనం అభియోగం మోపి దాడి చేశారని ఫిర్యాదు

కావలి రూరల్, మే 16: వెండి గొలుసులు కొనటానికి వెళ్లిన తమపై దొంగతనం అభియోగం మోపి దాడి చేశారని కావలి పట్టణానికి చెందిన కట్ట మమత ఆమె సోదరి ఈశ్వరమ్మలు గురువారం రాత్రి 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని వెంగళరావు నగర్‌కు చెందిన అక్క చెల్లెలు మమత, ఈశ్వరమ్మలు బుధవారం వెండి గొలుసులు కొనేందుకు బంగారు దుకాణాల వీధిలోని ఎస్‌పి పాన్ బ్రోకర్స్ దుకాణానికి వెళ్లారు. అక్కడ గొలుసులు చూసుకుని కొనుగోలు చెయ్యకుండా వచ్చి పక్క దుకాణానికి వెళ్లారు. కొంతసేపటి తరువాత ఎస్‌పి పాన్ బ్రోకర్స్ షాపు నిర్వాహకులు పొత్తూరు కుమారి, ఆమె భర్త సుబ్బారావు వచ్చి తమ దుకాణంలో కిలో వెండి వస్తువులు కనిపించటం లేదని మమత, ఈశ్వరమ్మలపై అభియోగం మోపుతూ దాడిచేసి గాయపర్చినట్లు 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా దుకాణంలోని సీసీ పుటేజ్ పరిశీలించిన పోలీసులకు మమత, ఈశ్వరమ్మలు వెండి వస్తువులు దొంగిలించినట్లు ఆధారాలు లభించలేదు. ఎస్‌ఐ అంబేడ్కర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దుకాణంలో వెండి వస్తువులు పోయినట్లు ఫిర్యాదు

తమ దుకాణంలో వెండి వస్తువుల దొంగతనం జరిగినట్లు ఎస్‌పి పాన్ బ్రోకర్స్ నిర్వాహకులు పొత్తూరి కుమారి, ఆమె భర్త సుబ్బారావు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా 1వ పట్టణ ఎస్‌ఐ అంబేడ్కర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ

- పలువురికి గాయాలు



ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

బుచ్చిరెడ్డిపాళెం, మే 16: లారీ - ఆర్టీసీ బస్సు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద ముంబయి జాతీయ రహదారిపై గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బుచ్చి నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి పామూరు నుంచి బుచ్చికి వస్తున్న ఆర్టీసీ బస్సుని ఢీకొంది. దీంతో బస్సులో పలువురికి గాయాలు కాగా స్థానిక యవకులు వారిని 108లో బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఓ చిన్నారిని మెరుగైన వైద్యంకోసం నెల్లూరుకు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరార్ అయ్యాడు. రాఘవరెడ్డి కాలనీ వద్ద ఓవ్యక్తి మృతిచెందగా అతడిని శ్మశానానికి తరలించేందుకు వచ్చిన శకటం రోడ్డుకు ఓవైపు ఆగివుండడం, మరోవైపు రోడ్డుకు అడ్డంగా కార్లు నిలిపి వుండడం వల్ల లారీ అదుపుతప్పి బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు, స్థానిక ప్రజలు తెలిపారు. ఈప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్ సమస్య పరిష్కరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సోమశిలలో 7.792 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, మే 16: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి జలాశయంలో 7.792 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు

మర్రిపాడు. మే 16: డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు రైతులకు సంతోషదాయకంగా ఉన్నాయి. గురువారం బోర్డుకు రైతులు 897 బేళ్లను తీసుకొని రాగా, 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 839 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 58 బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ట ధర రూ301కాగా, కనిష్ట ధర రూ205 పలుకగా సగటున ధర రూ266.41గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి జీ.రాజశేఖర్ తెలిపారు.

9 మద్యం సీసాల పట్టివేత

సంగం, మే 16: సంగం బస్టాండ్ నుంచి ఓ మహిళ ఆటోలో ఏఎస్‌పేట మండలం కావలియడవల్లి గ్రామానికి మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండడంతో పోలీసులకు సమాచారం రావడంతో ఆటోను తనిఖీ చేశారు. దీంతో కావలి యడవల్లికి చెందిన వెంకటరత్నమ్మ అనే మహిళ సంచిలో 9 మద్యం బాటిళ్లు ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 813 మంది గైర్హాజరు

వెంకటాచలం, మే 16 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 813 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ సెమిస్టర్ పరీక్షల్లో 8958 మంది విద్యార్థులకుగానూ 8145 మంది హాజరయ్యారు.

డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



ఉదయగిరి రూరల్: బీసీజీ టీకా వేస్తున్న వైద్యాధికారిణి శివకల్పన



సంగం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉదయగిరి రూరల్, మే 16: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యఆరోగ్య సిబ్బంది జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి మెయిన్‌బజార్ వరకు ర్యాలీ చేపట్టారు. దోమలు ఉత్పత్తి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కీటక జనిత వ్యాధుల నుంచి రక్షణ పొందాలని కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని సచివాలయం-3లో జరుగుతున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను మండల వైద్యాధికారిణి శివకల్పన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఈవో వెంకటసుబ్బయ్య, సీహెచ్‌వో శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సంగం: స్థానిక వైద్యశాల ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దోమలు నివారించండి డెంగ్యూను అరికట్టండి అంటు నినాదాలు చేశారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అశోక్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామపురం: సీతారామపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ డెంగ్యూడే సందర్భంగా గురువారం డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ డెంగ్యూ ఏడీస్ దోమ ద్వారా ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. ఇళ్లలో నీరు నిలువలేకుండా చూసుకోవాలని, అంతేకాకుండా టెంకాయ చిప్పలు, ఖాళీ సీసాలు, పాత టైర్లు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లలో ఫ్రైడేని డ్రై డేగా పాటించి దోమలు ఉత్పతి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో అబ్దుల్ మజీద్, ఎంపీహెచ్ఎస్ రియాజ్, ఏఎన్ఎంలు పీహెచ్ ఎన్ కృష్ణమ్మ, తిరుపాలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఉదయగిరి రూరల్, మే 16: మండలంలోని శకునాలపల్లిలో శ్రీ సీతారాముల ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లను అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణతంతును నిర్వహించారు. కల్యాణోత్సవంలో గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు పలు సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, మే 16: పట్టణంలోని ఉప్పు చెరువు ఫీడర్ పరిధిలో విద్యుత్ మెయిన్ లైనుకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించటం కోసం శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఎఈ టీవీ నరసింహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని జనార్థనకాలనీ, దుర్గమ్మ గుడి ఏరియా, మగ్గాల మిల్లుల ఏరియా, ఉప్పుచెరువు, ఏవలవ్యనగర్, బృందావనం, మాయాబజార్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభం



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారిణి, ఎంపీడీవో

కలిగిరి, మే 16: జాతీయ క్షయ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో ప్రతి గురువారం బిసిజి వ్యాక్సినేషన్ డే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 60 ఏళ్ళు పైబడిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగ తాగడం అలవాటు ఉన్నవారితోపాటు గత ఐదు సంవత్సరములుగా టీబీ వ్యాధితో బాధపడుతున్నవారికి వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని, మండలవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శులు చెంచుకృష్ణయ్య, అశోక్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో రోడ్లు జలమయం



బస్టాండ్ సెంటర్‌లోని ప్రధాన రహదారిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

లింగసముద్రం, మే 16 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గురువారం ఉదయం లింగసముద్రం గ్రామంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు గంట సేపు కురిసిన వర్షానికి గ్రామంలోని ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు జలమయం అయ్యాయి. అంతేగాక మురుగు కాలువలు పొంగి రోడ్డుపైకి ప్రవహించాయి.

ఎన్నికల్లో గెలుపు, ఓటమిపై సర్వత్రా చర్చ

అనంతసాగరం, మే 16: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు, ఓటములపై బస్టాండ్ సెంటర్లలో ఏ నలుగురు గుమికూడిన ఇదే చర్చ జరుగుతోంది. ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల పోటీ సమానంగా ఉండడంతో జిల్లా మొత్తం ఈ నియోజకవర్గం వైపే ఆసక్తి చూపుతున్నారు. అన్ని మండలాల్లో ఏబూత్‌లో ఎన్ని ఓట్లు ఉన్నాయి.. అందులో వైసీపీకి, టీడీపీకి ఎన్ని వస్తాయి? ఎంత మెజారిటీ వస్తుంది? అనే లెక్కలను గణాంకాలతో సహా చర్చించుకుంటున్నారు. వచ్చే నెల 4న ఫలితాలు వెల్లడి కానుండడంతో అప్పటి వరకు ప్రధాన పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. తమ అభ్యర్థే గెలుస్తాడని రెండు పార్టీలకు చెందిన మండల, గ్రామస్థాయి నేతలు ధీమా వ్యక్తం చేస్తూ పార్టీ శ్రేణులకు ఉత్సాహం నింపుతున్నారు. అంతేకాకుండా గెలుపు, ఓటములపై చర్చికుంటూనే బెట్టింగు వైపు పలువురు మొగ్గుచూపుతున్నారు.

సీతారామపురం : ఎన్నికలు ముగిశాయి.. ఇప్పుడు అందరూ గెలుపు, ఓటముల పై ఆసక్తితో ఉన్నారు. ఏ టీ షాప్ దగ్గర చూసినా, ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ సాగుతోంది. అంతేకాకుండా విజయం మనదే అంటూ ఏ పార్టీకి ఆ పార్టీ వారు అభినందనలు తెలుపుకుంటున్నారు. కొన్నిచోట్ల అయితే బెట్టింగ్‌ల హడావుడి కూడా జోరందుకుంది. ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు మాత్రం ఎన్నికలు ముగిసిన రోజు నుంచే తమ ఇళ్లకు గేట్లు వేసుకుని విశ్రాంతి దినాలుగా ప్రకటించుకున్నారు. కానీ పలువురు మాత్రం ఎక్కడ కలిసినా ఏ ఎమ్మెల్యే గెలుస్తాడు, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం రాబోతుంది అనే సంభాషణలు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ స్థానాలకు, ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఎంపీ స్థానాలు గురించి కొన్ని చోట్ల మాత్రమే చర్చ జరుగుతోంది. కానీ అసెంబ్లీ అభ్యర్థుల గెలుపోటముల గురించి మాత్రం ఎక్కువగా చర్చ నడుస్తోంది. దీంతో బెట్టింగ్‌లు కూడా భారీగానే సాగుతున్నాయి. విజయంపై మాత్రం ఏ పార్టీకి ఆ పార్టీ వారు ధీమాతో ఉన్నారు. ముఖ్యంగా ఉదయగిరి నియోజకవర్గంపై, నెల్లూరు ఎంపీ స్థానంపై గెలుపు ఎవరిది అనేది ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

పశువుల బీమా అందక పాడిరైతుల అవస్థలు

● పట్టించుకోని పాలకులు, అధికారులు



కొండాపురం, మే 16: పశువుల బీమా చెల్లించినా పాడి గేదెలు, ఆవులు అకాల మర ణాలు సంభ వించినప్పుడు పరిహారం అందడం లేదని మండలంలోని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. మండల పరిదిలోని 70 శాతం కుటుంబాలు కేవలం పశుపోషణపైనే ఆధా రపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా గేదెలు, ఆవులను మేపుకొని వాటి పాలను అమ్ముకొని త ద్వారా వచ్చే నగదుతో కుటంబపోషణ జరుపుకుంటున్నారు. పాడి గేదెలు వివిధ కారణాలతో మరణించినప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో పశువైద్యాధికారుల సూచనలతో గేదెలు, ఆవులకు పశువుల బీమా ప్రీమియం చెల్లిస్తున్నారు. అయినా బీమా నగదు అందడం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, పాలకులు వెంటనే స్పందించి తమకు పరిహారాన్ని వెంటనే విడుదలచేసి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

160 గేదెలకు క్లెయిమ్‌లు పంపించాం : పశువైద్యాధికారి

మండల పరిధిలో మరణించిన దాదాపు 160 గేదెలకు క్లెయిమ్ కోసం పంపించగా అందులో దాదాపు 60 గేదెలకు సంబంధించిన రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయ్యింది. ఎన్నికల కోడ్ కారణంగా పథకం హోల్డ్‌లో ఉంది. మిగిలిన రైతులకు నగదు జమ అవుతుందని పశువైద్యాధికారి ఎమ్ మధు తెలిపారు.

క్రీడలకు ప్రోత్సాహం కరువు



చెట్ల కింద ఆడుకుంటున్న విద్యార్థులు

ఆత్మకూరు, మే 16 : నియోజకవర్గంలో క్రీడలకు ప్రోత్సాహం కరువైంది. క్రీడలను ప్రోత్సహించాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చెప్పడమే కాని ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం క్రీడలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఏర్పాటు చేయలేదు. దానికి తోడు మినీస్టేడియం నిర్మాణం ప్రకటనలకే పరిమితమైంది. వేసవి సెలవుల్లో ఆడుకునేందుకు చిన్నారులకు ఆటస్థలాలు కరువయ్యాయి. దాంతో యువత చెట్ల కింద, ఖాళీ ప్రదేశాల్లో ఆడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆటస్థలాలను శుభ్రం చేసి క్రీడలను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

సంగం, మే 16: మండలంలోని కోలగట్ల వద్ద పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. అక్రమ ఇసుక తరలింపుపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో వెళ్లి పెరమన వద్ద ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

శుభ్రతకు నోచుకోని ఓవర్‌హెడ్ ట్యాంకులు

● గ్రామాలకు అందని రక్షితనీరు ● పొంచి ఉన్న రోగాలు

ఆత్మకూరు, మే 16 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు రాజకీయ పనుల్లో నిమగ్నమై ప్రజల సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం ప్రజలకు శుభ్రమైన తాగునీటి సరఫరాపై దృష్టి సారించలేదు. ఇటీవల ఓ మోస్తారుగా వర్షాలు కురుస్తుండడంతో తాగునీరు కలుషితమై అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 130 పంచాయతీల్లో మూడు సీపీడబ్ల్యూఎస్, 187 పీడబ్ల్యూఎస్, 91 ఎంపీడబ్ల్యూఎస్, 215 డీపీలకు పైబడి ఉన్నాయి. పీడబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించిన నిర్వహణను గ్రామ పంచాయతీలకు, సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణను ఆర్థిక సంఘం నిధులతో ట్యాంకుల నిర్వహణ చేపడుతున్నారు. నిధుల కొరత వెంటాడుతుండంతో ట్యాంకులు శుభ్రతకు నోచుకోవడం లేదు. నెలలో రెండు సార్లు ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంది. మైనర్ పంచాయతీల్లో ఒక్కొక్క ట్యాంకులో ఒక్కసారి శుభ్రం చేసేందుకు రూ.350ల నుంచి రూ.400లు, మేజర్ పంచాయతీల్లో రూ.550 నుంచి రూ.600ల వరకు ఖర్చు అవుతుంది. అయితే నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, మర్రిపాడు మండలాల్లోని వాటర్ ట్యాంకులు శుభ్రతకు నోచు కోవడంలేదు. దాంతో తాగు నీటిలో నీరు కలుషితమై సర ఫరా అవుతోంది. ఇకనైనా సం బంధిత అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి వాటర్ ట్యాంకుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



శుభ్రతకు నోచుకోని వాటర్‌ట్యాంకు

20న ఉచిత ఒడుగుల కార్యక్రమం

ఉదయగిరి రూరల్, మే 16: పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో రహమతులిల్ ఆలమీన్ ట్రస్టు చిన్న మసీదు ఆధ్వర్యంలో ఈనెల 20న ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగుల(ఖత్నా) కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపర్చాలి : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐనాయకులు మాలకొండయ్య, సురేష్‌బాబు

కందుకూరు, మే 16: కందుకూరు ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపర్చాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాటాడుతూ కోట్ల రూపాయలు వెచ్చించి భవ నాలు నిర్మిస్తున్నారేకానీ కనీస వైద్యసేవలు అందించటంపై దృష్టిపెట్టడం లేదని, బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని హాస్పటల్‌కు తీసుకొస్తే మావద్ద వెంటిలేటర్ సదుపాయం లేదని ఆ యువకునికి ప్రథమ చికిత్స చేయటానికి కూడా నిరాకరించిన వైద్యసిబ్బంది మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు హాస్పటల్‌కు తీసుకెళ్లాలని ఉచిత సలహా ఇవ్వటం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కరోనా సమయంలో వెంటిలేటర్ల సదుపాయంతో పాటు 24 గంటలు ఆక్సి జన్ అందించే సౌకర్యాన్ని కూడా కందు కూరు ఏరియా హాస్పటల్‌లో ఏర్పాటు చేయటం జరిగిందని గొప్పలు చెప్పిన డాక్టర్లు కనీస వైద్య సేవలు అందించకుండా రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుండ టమే గాక ప్రైవేటు హాస్పటల్స్ వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునందిస్తు న్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టి కందుకూరు ఏరియా హాస్పటల్‌లో సౌకర్యాలు, వైద్యసేవలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

కావలిలో పడకేసిన పారిశుధ్యం

● పందుల స్వైర విహారం



ట్రంకురోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

కావలిటౌన్, మే 16: కావలి పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దుర్గంధంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిత్యం రద్దీగా వుండే తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డు తూర్పు వైపు చెత్త పేరుకుపోయి అందులో పందులు పొర్లాడుతున్నాయని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్యం మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె



రైల్వే రోడ్డు పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

కావలి, మే 16: కావలి పట్టణ రైల్వేరోడ్డులో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ప్రమాదకరంగా ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఒకపక్క పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ గెస్టహౌస్, మరో పక్క జామియా మసీద్‌కు వెళ్లే దారిలో ఉన్న ఈ దిమ్మె రోజురోజుకు రోడ్డు వైపునకు ఒరుగుతోంది. వర్షాలు పడితో దిమ్మె పూర్తిగా నేలకొరిగే ప్రమాదం ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి దిమ్మెను సరిచేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోతకు గురైన ఉదయగిరి-బండగానిపల్లి రోడ్డు



కోతకు గురైన ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు

ఉదయగిరి రూరల్, మే 16: ఇటీవల కురిసిన వర్షాలకు ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు కోతకు గురి కావడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఘాట్‌రోడ్డు పలు ప్రాంతాల్లో కోతకు గురై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు కోతకు గురైన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగు

● ప్రజల అవస్థలు



పట్టణంలోని యూనియన్‌రోడ్డుపై ఉన్న మురుగు

ఉదయగిరి, మే 16: పట్టణంలోని పలు వీధుల్లో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోంది. అంతేకాకుండా మురుగు నీరు నిల్వ ఉండడంతో అటుగా వెళ్లే ప్రజలు రోడ్డుదాటాలంటే ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలాజీనగర్, సినిమాహాలు, సుద్ధబావివీధి, గండిపాళెంరోడ్డు, అగ్రహారం తదితర ప్రాంతాల్లో మురుగు నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీరు నిల్వలేకుండా చూడాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

ఆర్బీకే, సచివాలయాల నిర్మాణం ఎప్పటికి పూర్తిచేస్తారు ?



మండల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గుడ్లూరు, మే 16: మండల కేంద్రమైన గుడ్లూరు సచివాలయం, రైతుభరోసా కేంద్రా లు ఎప్పటికి పూర్తిచేస్తారో తేల్చి చెప్పాలని గుడ్లూరు గ్రామ సర్పంచ్ పాలకీర్తి శంకర్ అధికారులను నిలదీశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గుడ్లూరు సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ గుడ్లూరు ఎస్సీకాలనీ, ఎస్టీకాలనీలతోపాటు పలుప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను కోరారు. పాజర్ల సర్పంచ్ పాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గుడ్లూరు - తెట్టు రోడ్డును కలుపుతూ పోట్లూరు నుంచి పాజర్ల గ్రామంలోకి వెళ్లే రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, పాజర్ల ఎస్టీ కాలనీలో ఇళ్లమీదుగా ఉన్న విద్యుత్ వైర్లు తొలగించాలని కోరారు. కర్లపాలెం సర్పంచ్ చాలపల రమణయ్య మాట్లాడుతూ రాళ్లపాడు రక్షిత మంచినీటి పథకం ద్వారా తీరప్రాంత గ్రామాలకు సక్రమంగా నీరు అందేలా చూడాలని కోరారు. ఎంఈవో గోవర్ధన్ మాట్లాడుతూ గుడ్లూరు కేంద్రం హైస్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఇంటర్ కళాశాలను జూన్ 1 నుంచి ప్రారంభించనున్నట్లు అందుకు సంబంధిచి అడ్మిషన్‌లు కూడా త్వరలో తీసుకోవడం జరుగుతుందన్నారు. అడవిరాజుపాలెంలో మంచినీటి పైపులైన్లకు మరమ్మతులు చేయించాలని ఎంపీపీ పులి రమేష్ అధికారులను కోరారు. అలాగే పూరేటిపల్లి రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ కాకర్ల వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ జేఈ హనుమంతరావు, ఏపీఎం అశోక్, ఎంపీటీసీ సభ్యురాలు చెన్నారెడ్డి వరమ్మ, సర్పంచ్ ఎండ్లూరి డేవిడ్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువులకు రాళ్లపాడు నీరు అందించండి

● అధికారులకు రైతుల వినతి



చిల్లచెట్లతో నిండిన లింగసముద్రం కొత్త చెరువు

లింగసముద్రం, మే 16: స్థానిక కొత్త, పాత చెరువులకు రాళ్లపాడు నీరు అందించాలని పలు గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు. గత ఐదారు సంవత్సరాల నుంచి తీవ్ర వర్షాభావంతో ఈ చెరువులకు నీరు చేరలేదు. దీంతో రైతులు పంటలు సాగు చేయలేదు. పంటలు సాగు లేకపోవడంతో అటు రైతులు, ఇటు రైతు కూలీలతో పాటు పశువులు కూడా గ్రాసం, తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ కరువు పరిస్థితులను అధిగమించేందుకు ఈ రెండు చెరువులకు రాళ్లపాడు ప్రాజెక్టులోని నీటిని తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని, దీని కోసం ప్రభుత్వం ప్రాజెక్టు దక్షిణం వైపు నుండి ఒక కాలువను కొత్త, పాత చెరువుల ఎగువ భాగం వరకు తవ్వి లిఫ్ట్ ద్వారా నీటిని రెండు చెరువులకు తరలిస్తే సాగునీటి సమస్య తీరి పంటలు సాగు చేసుకోవచ్చని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకొని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రోడ్లపైనే వాహనాలు, తోపుడుబండ్లు



రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, తోపుడుబండ్లు

ఉదయగిరి రూరల్, మే 16: నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య నిత్యం వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రధాన మార్గాల్లో తరచూ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతరత్రా వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీకావు. దశాబ్దాలుగా ఈ సమస్య ఉన్నా రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో చుట్టుపక్కల గ్రామా ల ప్రజలు నిత్యం ఇక్కట్లకు గురవుతున్నారు. ఒకవైపు నుంచి బస్సు వస్తే రెండోవైపు బస్సు వెళ్లే పరిస్థితి లేదు. వాహనం నిలిచిన వెంటనే పదుల సంఖ్యలో ఇతరత్రా వాహనాలు నిలబడిపోవాల్సిన పరిస్థితి. రోడ్లపైనే ద్విచక్రవాహనాలు, ప్రధానంగా గండిపాళెం మార్గం, మెయిన్‌బజార్, పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో కూరగాయలు, పండ్లు అమ్మే తోపుడుబండ్లు, పండ్లు విక్రయించే వాహనాలు రోడ్డు మార్జిన్‌లో ఉంచి వ్యాపారాలు సాగిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికితోడు ద్విచక్ర వాహనదారులు అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి. ఆటోవాలాలు సైతం ప్రయాణికులను ఎక్కించుకునేందుకు రోడ్డుపైనే వాహనాలను నిలిపివేయడంతో వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది.

రోడ్ల విస్తరణ లేక ఇక్కట్లు: పట్టణంలో పంచాయతీ బస్టాండ్ సెంటర్, మెయిన్‌బజార్, గండిపాళెం మార్గాల్లో రోడ్ల విస్తరణ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎదురువుతుందని ప్రజలు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ల వెడల్పు తక్కువగా ఉండడం, వాహనాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండడంతో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారింది. ఇప్పటికైనా అధికారులు పట్టణంలో రోడ్ల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

శ్రీమహాలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



శ్రీమహాలక్ష్మిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

నెల్లూరు (సాంస్కృతికం) మే 16 : నగరంలోని స్టోన్ హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు గురువారం శివరోజుకి చేరాయి. ఈ సందర్భంగా విశేష అభిషేకాలు, హోమాలు, పూజలు, పూలంగిసేవ జరిగాయి. రాత్రి 7గంటలకు అమ్మవారికి మహాలక్ష్మి అలంకారంలో ఉత్సవం జరిగింది. ఉభయకర్తలుగా వాసవీ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ వ్యాపారులు వ్యవహరించారు. ఈ కార్యక్రమం అర్చకులు శివకుమార్ స్వామి ఆధ్వర్యంలో జరిగింది.

కనుల పండువగా పార్వతీ పరిణయ అలంకారం



మూలస్థానేశ్వరాలయంలో పార్వతీ పరిణయం అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం) మే 16 : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, ప్రత్యేక పుష్పాలంకారం జరిగింది. రాత్రి స్వామివార్లకు పార్వతి పరిణయం అలంకారం కనుల పండువగా జరిగింది. అనంతరం తోటలో వేంచేసిన స్వామి, అమ్మవార్లకు కుంభ హారతులు జరిగాయి. ఈ వేడుకలను ధర్మకర్తలు, ఉభయకర్తలు, ఈవో వేణుగోపాల్, సిబ్బంది పర్యవేక్షించారు.

బుచ్చిలో జోరు వాన

బుచ్చిరెడ్డిపాళెం, మే 16: బుచ్చిరెడ్డిపాళెం మండలంలో గురువారం ఉదయం వాన జోరు వాన కురిసింది. దీంతో రోడ్లు జలమయం అయ్యాయి. ఈవర్షంతో జనాలతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ బోర్లు కింద రెండోకారు వరి సాగుకు సిద్ధమవుతున్న రైతాంగానికి వర్షం మేలుచేసింది.

పొదలకూరులో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్



టోర్నమెంటులో పాల్గొన్న క్రీడాకారులు

పొదలకూరు, మే 16 : పట్టణంలోని సంగంరోడ్డు తెలుగుగంగ కాలువ సమీపంలోని మైదానంలో ఫ్రెండ్స్ క్రికెట్ టీం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంటు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంటు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథు లుగా మొదటి బహుమతి ప్రదాత పలుకూరు మురళీరెడ్డి, ద్వితీయ బహుమతి ప్రదాత వెడిచర్ల మురళీ పాల్గొన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులకు పలు సూచనలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ కూడా క్రీడా స్ఫూర్తితో ఆడాలని, ఆటలో గెలుపు ఓటములు సహజమని, ఎటువంటి గొడవలు లే కుండా క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. 16 సంవత్సరాల నుంచి ప్రతి ఏటా వేసవి కాలంలో ఇలాంటి క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నటువంటి ఆర్గనైజర్ మన్నవరపు రవికుమార్‌ను వారు అభినందించారు. ఆర్గనైజర్ రవికుమార్ మాట్లాడుతూ ఈ టోర్నమెంటులో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.10వేలు, అలాగే బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఆల్‌రౌండర్‌లకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

సమస్యలపై పోరాటం..

స్వచ్ఛత కోసం ఆరాటం !

- బుజబుజనెల్లూరులో ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలు
- రోడ్లపైనే మురుగునీరు
- అపరిశుభ్రంగా వాటర్‌ట్యాంకు పరిసరాలు
- ముందుకు కదలని మురుగునీరు
- ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వాటర్ ట్యాంకు చుట్టూ దుర్గంధం

నెల్లూరు (విద్య), మే 16 : ఇంటిపక్కన, ఊరి చివరి ఎక్కడ చూసినా చెత్తాచెదారమే. కొన్నిచోట్ల మురుగుకాలువలు ఉండవు. మరికొన్ని ఉన్నా నీరు పారదు. వీటన్నింటినీ సరిచేయడానికి ప్రభుత్వ పరంగా ఏనాటి నుంచో పటిష్ట వ్యవస్థ ఉన్నా జవసత్వాలుడిగింది. ఈ విషయాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ ఒక్కటే విరుగుడుగా భావించింది. ఇందులో భాగంగా దేశ ప్రధానే స్వయంగా చీపురుపట్టారు. వీధులను ఊడ్చారు. అయినా నగరపాలక సిబ్బందిలో మార్పు రాలేదు. మరోపక్క పురజనులు ఈ సమస్యలతో ఇక్కట్లు పడుతున్నారు. నెల్లూరు నగరంలోని బుజబుజ నెల్లూరు(25వ డివిజన్)లో ప్రజలు ఏళ్లతరబడి సమస్యలతో సహవాసం చేస్తున్నారు. 10వేలమందికి పైగా నివాసం ఉండే ఈ ప్రాంతంలోని తల్పగిరికాలనీ, ఆర్టీసీకాలనీ, శివాజీనగర్, వికలాంగుల కాలనీ, వల్లూరమ్మకాలనీ, గొల్లపాళెం, రామ్‌నగర్ వీధి, అంబేడ్కర్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో తిష్టవేసిన సమస్యలతో సతమతమవుతున్నారు. పాలకులు, అధికారులు వీటిపై శ్రద్ధ చూపడం లేదు. ఇప్పటికైనా పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

● స్తంభించిన డ్రైనేజీ

ప్రధాన రహదారులపైనే మురుగునీరు పారుతోంది. దీంతో వాహనదారులు రాకపోకలకు అంతరాయం కలగడంతోపాటు డ్రైనేజీ నీటితో రోడ్లు దెబ్బతింటున్నాయి. ఆవాసల నడుమ అపరిశుభ్రత, దోమల విజృంభణ , పందులు స్వైర విహారం సర్వసాధారణమైంది. కనీసం ఈ ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లడం, క్రిమిసంహార మందులను వాడడం కూడా కరువైనట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

● పేరుకుపోయిన చెత్త



సర్వీస్ రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

చెత్తాచెదారం రోడ్లపైనే పేరుకపోయింది. ఇళ్లకు వచ్చి వాహనాల్లో చెత్తను తీసుకెళ్లినా కొన్ని ప్రాంతాల్లో వీధి చివరనే చెత్తను వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తకుప్పలు పేరుకుపోవడంతో ఆవులు, పందులు, కుక్కలు పెద్ద ఎత్తున గుమిగూడి వీటిని చెల్లాచెదురు చేస్తుండడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది.

● దుర్గంధభరితంగా వాటర్ ట్యాంక్

బుజబుజనెల్లూరుకు మంచినీటిని సరఫరా చేసే ప్రధాన వాటర్ ట్యాంక్ కింద, పరిసరాలన్నీ దుర్గంధభరితంగా మారాయి. మురుగంతా పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో ఈ ప్రాంతంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఈ మురుగంతా వాటర్ ట్యాంక్‌లోకి వెళ్లే నీటిపైపుల ద్వారా నీటిలోకి చేరుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మంచినీటి కుళాయిల్లో మురుగు వాసన వస్తోందని, ఈ నీటినే కాచి వడపోసుకుని తాగుతున్నామని చెబుతున్నారు.

● ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

డివిజన్‌లో విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. సరైన రక్షణ లేకపోవడం, వైర్లన్నీ రోడ్లపైనే ఉండడంతో ఈ ప్రాంతంలో నడిచేందుకే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యుత్ అంతరాయాలు కూడా అధికమవుతున్నాయని, ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్‌తో తీవ్ర నష్టాలు సంభవించాయని స్థానికులు చెబుతున్నారు. హైఓల్టేజీ, లోఓల్టేజీలతో ఇంట్లోని విద్యుత్ పరికరాలన్నీ దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● రాకపోకలకు తీవ్ర అంతరాయం

బుజబుజనెల్లూరు జాతీయ రహదారి పక్కనే ఉండడం, డివిజన్‌లోకి ప్రవేశించేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే చొరవతో సర్వీస్ రోడ్డును నిర్మించారు. అయితే ఈ రోడ్డును లారీలు, ఇతర వ్యాపారులు ఆక్రమించుకోవడంతో ఈ రోడ్డంతా రద్దీగా మారింది. రోడ్డుపైనే అడ్డంగా లారీలను నిలిపివేయడం, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను రిపేరు చేసుకోవడంతో పాటు రోడ్డుపైనే ఏర్పాటు చేసిన కొంతమంది వ్యాపారులు వాహనాలను అడ్డంగా పార్కు చేస్తుండడంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా మారింది. ఈ విషయమై పాలకులు, అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైనే మురుగునీరు

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ



బుచ్చి : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, మే 16: డెంగ్యూ నివారణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా జొన్నవాడ పీ హెచ్‌సీ పరిధిలోని డెంగ్యూ నివార ణపై అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. దోమకాటువల్ల వ చ్చే డెంగ్యూ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి వుండాలన్నారు. వర్షాకాలంలో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా నీటినిల్వలు లేకుండా శుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ సుబ్బారెడ్డి, వైద్య, ఆరోగ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మనుబోలులో ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

మనుబోలు : డెంగ్యూ జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ వైద్య సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి దళితకాలనీ వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ ప్రజలకు దోమలతో వచ్చే వ్యాధులు, జ్వరాల గురించి అవగాహన కల్పించారు. దోమల నివారణకు ప్రజలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు మొహసీనా సుల్తానా, గేయపూజిత, సీహెచ్‌వో రాజయ్య, సూపర్‌వైజర్ వెంకటరమణయ్య, పద్మావతి, హెల్త్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందుకూరుపేటలో వైద్య సిబ్బంది ర్యాలీ

ఇందుకూరుపేట : జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ నివారణపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశావాలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్‌లు రమా, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

ఉదయగిరి రూరల్ : మండలంలోని శకునాలపల్లిలో శ్రీసీతారాముల ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లను అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాలవారు పాల్గొన్నారు.

నృసింహుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు రూరల్ మే 16 : వేదగిరి లక్ష్మీనృసింహుడి బ్రహ్మో త్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. ఆలయ అర్చకులు, అధికారులు పుట్టమట్టిని తీసుకువచ్చి ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఉత్సవర్లకు విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం నుంచి రోజుకో వాహనంపై శ్రీవారు భక్తులను కటాక్షించనున్నారు.

ఉపాధ్యాయుడిని ఆదుకోవాలి

నెల్లూరు (విద్య), మే 16 : ఎన్నికల విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడిని ఉన్నతాధికారులు ఆదుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతిశర్మ ఒక ప్రకటనలో కోరారు. తిరుపతిజిల్లా బీఎన్ కండ్రిగ మండలం ఎంపీపీఎస్ చిన్నిగుంట పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సుమన్‌రావు ప్రభుత్వ విధుల నిర్వహణలో అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో వైద్య ఖర్చులపై తిరుపతి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారులు స్పందించి సాయం అందచేయాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

తోటపల్లిగూడూరు, మే 16 : గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కృష్ణపట్నం పోర్టు సీఐ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం చింతోపు గ్రామంలో ఎస్ఐ జంపానీ కుమార్‌తో కలిసి సీఐ మీడియాతో మాట్లాడారు. పోలింగ్ ముగిసిన మరుసటి రోజు చింతాకులో గొడవలు చేసిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గ్రామంలో గొడవలు నివారించేందుకు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. ఇటువంటి సంఘటనలు మరలా జరగకుండా చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉందని గుర్తు చేశారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, మే 16: బుచ్చిరెడ్డిపాళెంలోని రాఘవరెడ్డి కాలనీ పంచేడు రోడ్డు వద్ద జాతీయ రహదారిపై రోడ్డు మీద వెళ్తున్న పొన్నూరు పద్మావతిని బైక్ ఢీకొట్టిన సంఘటన గురువారం ఆప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పద్మావతికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వెంగళరావునగర్ వాసులు

నెల్లూరు (విద్య), మే 16 : నగరంలోని వెంగళరావునగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం చేపట్టడంపై స్థానికులు గురువారం ఆందోళన చేపట్టారు. టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు బెజవాడ మేఘనాథ్‌సింగ్ మాట్లాడుతూ నివాసాల నడుమ సెల్‌టవర్ ఏర్పాటు చేయడంతో స్థానికులకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. అలాగే టవర్ నుంచి వచ్చే రేడియేషన్‌తో పర్యావరణం కూడా దెబ్బతింటుండడంతో ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు తాము అంగీకరించబోమన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సేవకుడు కిన్నెర : నారాయణ



పార్థసారథి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నారాయణ

నెల్లూరు(వైద్యం) మే 16 : ప్రజా సేవకుడు కిన్నెర పార్థసారథి అని మాజీ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరులోని కిన్నెర నివాసంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణ మాట్లాడారు. కరోనా సమయంలో కిన్నెర పార్థసారథి మరణించటం బాధాకరమన్నారు. ఆయన ని త్యం ప్రజలకు ఎన్నో సేవలు చేసేవారని చెప్పారు. అ నంతరం పేదలకు వస్త్రఅన్నదానం చేశారు. కార్యక్ర మంలో కిన్నెర మాల్యాద్రి కుటుంబ సభ్యులు తదితరు లు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్ పరీక్షలు ప్రారంభం

నెల్లూరు (విద్య), మే 16 : ఇంటర్మీడియట్ పూర్తయి ఇంజనీరింగ్, వ్యవసాయ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు నిర్వహించే ఈఏపీ సెట్‌లో గురు, శుక్రవారాల్లో బైపీసీ స్ట్రీమ్‌కు, 18 నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 16వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయడంతో తొలిరోజున ప్రశాంతంగా పరీక్ష జరిగినట్లు ఇంజనీరింగ్ కళాశాలల నిర్వాహకులు తెలిపారు. జిల్లాలో మొత్తం పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్ష జరుగుతున్నాయి.

జిల్లా గ్రంథాలయంలో వేసవి శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

నెల్లూరు (సాంస్కృతికం) మే 16 : నగరంలోని రేబాలవారివీధిలో గల జిల్లా గ్రంథాలయం సంస్థలో గురువారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. సంస్థ చైర్మన్ కుమార్‌రాజా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం నెలపాటు నిర్వహించనున్నామని, ఈరోజు వచ్చిన విద్యార్థులు వారి ఇళ్ల చుట్టుపక్కల ఉన్న విద్యార్థులకు కూడా తెలియజేసి వారిని కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేటట్లు చేయాలన్నారు. ఈ శిక్షణ శిబిరంలో డ్రాయింగ్, ఇన్నోవేటివ్ క్విజ్, పుస్తక పఠనం, ఈజీ మాథ్స్ వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఉంటాయని తెలియజేశారు. ప్రజాసైన్స్ వేదిక నెల్లూరు పట్టణ అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌లో భాగంగా వివిధ రకాల టోపీలను తయారు చేసే విధానం గురించి తెలియచేశారు. పిల్లలకు డ్రాయింగ్‌లోని నైపుణ్యాలను తెలిపారు. అలాగే పిల్లలచే చిత్రాలను గీయించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, ప్రజాసైన్స్ వేదిక పట్టణ అధ్యక్షుడు సతీష్‌కుమార్, గ్రంథాలయ సిబ్బంది కృష్ణయ్య, జితేంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జడ్పీ): నగరంలోని తెలుగుగంగ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్లు మరమ్మతులు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నగర ఈఈ సోమశేఖర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హౌసింగ్‌బోర్డు, ఎస్‌బీఐ, జడ్పీ కాలనీలు, ఇందిరాగాంధీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

ఇరుగాళమ్మ ఆలయ భూమిలో వ్యర్థాలు

- ఖాళీగా ఉందని తోలారా.. ఆక్రమించేందుకు తోలుతున్నారా ? ● అడ్డుకున్న స్థానికులు
- వాహనాలు రాకుండా గుంత తవ్విన అధికారులు

నెల్లూరు(వ్యవసాయం), మే 16 : అక్కడ అంకణం రూ. అరకోటి.. పైగా ఆ స్థలం వివాదంలో ఉంది.. కోర్టులో కేసు నడుస్తోంది.. అయితే కొంతమంది ఆ స్థలాన్ని చదును చేసేందుకు ఇళ్ల వ్యర్థాలు తోలారా..? లేక ఖాళీగా ఉండడంతో దూరం తగ్గుతుందని తోలారో తెలియదు కానీ.. స్థానికులు, ఆలయ అధికారులు, సిబ్బంది ఆ పనిని అడ్డుకున్నారు. అయితే ఎవరు ఈపని చేశారనే దానిపై స్పష్టత లేదు.నెల్లూరు ఇరుకళల పరమేశ్వరి గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం ఎదురుగా రోడ్డు అవతల సుమారు ఎకరా స్థలం ఖాళీగా ఉంది. చుట్టుపక్కల నివాస గృహాలు, పెట్రోలు బంకు ఉన్నాయి. ఇక్కడ అంకణం రూ. అరకోటి వరకు పలుకుతోంది. అయితే ఈస్థలంపై వివాదం ఉంది. కొన్నేళ్లుగా కోర్టులో కేసు కూడా నడుస్తోంది. ఇది ప్రైవేటు స్థలం కాదని, ఆలయానికి చెందిన భూమిగా అధికారులు కేసును వాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఆప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి వాహనాలతో ఇంటి వ్యర్థాలను తోలారు. దాదాపుగా అర ఎకరా స్థలం వరకు గుట్టలు గుట్టలుగా వ్యర్థాలు తోలేశారు. గుర్తించిన స్థానికులు ఇళ్ల వ్యర్థాలతోపాటు చెత్తాచెదారాలు కూడా వేస్తారేమోనని ఆలయ సిబ్బంది దృష్టికి తీసుకొచ్చారు. వారు వచ్చి వాహనాల డ్రైవర్లను గురువారం ప్రశ్నించారు. అసలెవరు చేయిస్తున్నారని అడిగేలోపే వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. మళ్లీ వస్తారేమోనని ఆలయ సిబ్బంది అక్కడే వేచి ఉన్నా వారు రాలేదు. ఖరీదైన స్థలం.. రోడ్డు పక్కనే ఖాళీగా ఉందని చదును చేసుకుని ఆక్రమించేందుకు తోలుకున్నారేమోనని అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.



ఆలయ స్థలంలో తోలిన ఇళ్ల వ్యర్థాలు, చెత్తాచెదారాలు

అధికారులు ఏంచేస్తున్నారు..?



ఇళ్ల మధ్య వ్యర్థాలు ఇక్కడ వేస్తున్నారని గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చా. మున్సిపాలిటీ వారు ఇక్కడ తోలరా.. లేక ఎవరో ప్రైవేటు వ్యక్తులు తోలారో తెలియక అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇళ్ల మధ్య వ్యర్థాలు వేస్తుంటే మున్సిపాలిటీ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు.

- పీ లీల, స్థానికురాలు

వాహనాలు రాకుండా గుంత తవ్వించా..

వ్యర్థాలు తోలుతున్నారని స్థానికులు సమాచారం ఇవ్వడంతో సిబ్బందిని అక్కడకు పంపించా. వారు ప్రశ్నించడంతో తిరిగి వాహనాలు రాలేదు. ఇది ఆలయానికి చెందిన స్థలమని ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టులో కేసు నడుస్తోంది. ఆ స్థలంలో బోర్డు కూడా ఏర్పాటు చేశాం. వ్యర్థాలు ఎవరు తోలారో తెలియలేదు. ఆ స్థలంలోకి వాహనాల రాకపోకలు లేకుండా చేసేందుకు ఆ స్థలంలో పెద్ద గుంత తవ్వించా.

- మల్లికార్జునరెడ్డి, ఇరుగాళమ్మ ఆలయ ఈవో

ఊహించిందే జరిగింది!

సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలను నియంత్రించడంలో పోలీసు యంత్రాంగం విఫలం కావడంతో అంతా ఊహించినట్టుగానే జరిగిపోయింది. ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌పై బదిలీ వేటు వేసిన ఎన్నికల కమిషన్.. తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ భాస్కర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిని సస్పెండు చేసింది. ఎస్పీ సహా వీరందరిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. దీనికి తోడు ఈసీ నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం జిల్లాలో కూడా హింసాత్మక ఘటనల పూర్వాపరాలను, వాటిని అడ్డుకోవడంలో, అనంతర చర్యల్లో ఎస్పీ సహా కింది స్థాయి అధికారులు వ్యవహరించిన తీరును లోతుగా విచారించి ఈసీకి నివేదిక ఇవ్వనుంది. ఎన్నికల నిర్వహణను ఆషామాషీగా తీసుకున్న అధికారులు దానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- జిల్లా ఎస్పీ బదిలీ
- తిరుపతి డీఎస్పీ, ఎస్బీ డీఎస్పీ సస్పెన్షన్
- స్పెషల్ బ్రాంచి సీఐ, అలిపిరి సీఐ కూడా..
- ఐదుగురిపైనా శాఖాపరమైన విచారణ
- ఎన్నికల కమిషన్ సంచలనాత్మక చర్యలు
- చంద్రగిరి నియోజకవర్గంలో 'పోలింగ్'.. అనంతర హింసాత్మక ఘటనలపై ఆగ్రహం



ఎస్పీ కృష్ణకాంత్ పటేల్
స్పెషల్ బ్రాంచి డీఎస్పీ భాస్కర్‌రెడ్డి
తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి
స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్
అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి

నామినేషన్ల నాడే తొలి ప్రమాద ఘంటికలు

చంద్రగిరి వైసీపీ, టీడీపీ అభ్యర్థులను గత నెల 25వ తేదీన ఒకే సమయంలో నామినేషన్లకు అనుమతించినప్పుడే అధికారుల అవగాహనా రాహిత్యం బట్టబయలైంది. టీడీపీ అభ్యర్థి కోసం భారీ ఎత్తున తరలివచ్చిన శ్రేణులను పోలీసులు నియంత్రించలేకపోయారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద ఇరువర్గాలూ రాళ్ల దాడికి దిగడంతో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై రాళ్లు, కర్రలతో దాడి జరిగింది. లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపు చేయాల్సి వచ్చింది. వాస్తవానికి అప్పుడే అధికారులు అప్రమత్తమై చంద్రగిరి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించివుండాల్సింది. కానీ అలా జరగలేదు.

నానీపై దాడి ఘటనలో బట్టబయలైన పోలీసు వైఫల్యం

పోలింగ్ మరునాడు టీడీపీ అభ్యర్థి నానీపై జరిగిన దాడి ఘటనలో పోలీసు వైఫల్యం బయటపడింది. నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తనకు, తన కుటుంబానికి తగిన రక్షణ లేదని ఆయన హైకోర్టును ఆశ్రయించి గన్‌మెన్ భద్రత పొందారు. అలా పొందిన కొద్ది రోజులకే ఆయనపై ఏకంగా హత్యాయత్నం జరిగింది. ప్రధాన ప్రతిపక్ష నేతకు తగిన భద్రత కల్పించడంలో పోలీసు యంత్రాంగం విఫలమైంది. తర్వాత కూడా అక్కడ పరిస్థితులను అదుపు చేయడంలో పోలీసు యంత్రాంగం చేతులెత్తేసింది. వర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఈ దాడి ఈవీఎంలు వుంచిన స్ట్రాంగ్ రూముల భద్రతను కూడా ప్రశ్నార్థకం చేసింది.

డక్కిలి, చిల్లకూరు మండలాల్లోనూ హింసాత్మక ఘటనలు

- గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వరరెడ్డికి తిక్కగుంటపాలెంలో రొయ్యల చెరువులు ఉన్నాయి. పోలింగ్‌కు ముందు రోజైన ఆదివారం రాత్రి రొయ్యల చెరువుల్లో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపారు. దీంతో రూ. 15 లక్షలు విలువైన రొయ్యలు చనిపోయి నీటిపైకి తేలాయి. ఈ ఘటనపై బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశాడు.
- వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి మండలం అల్తూరుపాడులో పోలింగ్ రోజు ఓ కానిస్టేబుల్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ గ్రామస్తులు దాడి చేసి కొట్టారు.
- గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలం చింతవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత గోపాల్ పోలింగ్ రోజు టీడీపీకి అనుకూలంగా పనిచేశారని ఆరోపిస్తూ మరుసటి రోజైన మంగళవారం వైసీపీ వర్గీయులు ఇనుప రాడ్లతో దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరిచారు.
- చిల్లకూరు 114, 117 బూత్‌లలో పోలింగ్ రోజు టీడీపీ నేత కొండా రామచంద్రారెడ్డిపై వైసీపీ నేత నరేంద్ర రెడ్డి దాడి చేసి కొట్టారు. బాధితునికి రక్షణ కల్పించాల్సిన చిల్లకూరు ఎస్‌ఐ అంజిరెడ్డి దానికి భిన్నంగా బాధితుడినే లాఠీతో చితకబాదారు. తోపులాట, ఘర్షణతో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌తో పాటు టీడీపీ దళిత మహిళా నేత విజయ కూడా గాయపడ్డారు.

పోలింగ్ రోజు ఐదు చోట్ల ఉద్రిక్తత

ఈనెల 13న పోలింగ్ సందర్భంగా రామచంద్రాపురం మండలం బ్రాహ్మణకాల్వ పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ ఘర్షణ జరిగింది. బీఎస్ఎఫ్ జవాన్ గాల్లోకి కాల్పులు జరిపినా పరిస్థితి అదుపులోకి రాలేదు. వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి భారీగా అనుచరులను వెంటదీసుకుని టీడీపీ కంచుకోట వంటి ఆ గ్రామంలోకి వచ్చి తమ ఏజంట్లపై దాడి చేసింది ఎవరంటూ టీడీపీ ఏజంట్లపై దౌర్జన్యానికి యత్నించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. అదే రోజు నానీ స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లికి వెళ్లిన వైసీపీ అభ్యర్థిని గ్రామస్తులు అడ్డుకోగా ఉద్రిక్తత నెలకొంది. ఆయన్ను నిర్బంధించారన్న ప్రచారంతో తుమ్మలగుంటలో గ్రామస్తులు పోలింగ్ కేంద్రాన్ని చుట్టుముట్టి మోహిత్ క్షేమంగా వచ్చేవరకూ ఈవీఎంలను తరలించడానికి వీల్లేదని అడ్డుపడ్డారు. అక్కడ టీడీపీ నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డిపై దాడికి యత్నించారు. అదే రోజు రాత్రి చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి గ్రామాల్లో వైసీపీ, టీడీపీ వర్గీయులు దాడులు, ప్రతిదాడులకు పాల్పడ్డారు. ఆ గ్రామాలకు మోహిత్ అనుచరులతో వెళ్లడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. వైసీపీ సర్పంచ్ ఇల్లు, రెండు కార్లను టీడీపీ వర్గీయులు తగులబెట్టారు.



పోలింగ్ రోజున బ్రాహ్మణ కాల్వ పోలింగ్ కేంద్రంలో ఘర్షణ



ఈనెల 13న కూచువారిపల్లిలో చెవిరెడ్డి మోహిత్, పులివర్తి వినీల్ మధ్య వాగ్వాదం

కలెక్టర్ లక్ష్మీశా బదిలీతో అప్రమత్తం కాని యంత్రాంగం

ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లకు మించి విధులు నిర్వర్తిస్తున్న అధికారుల బదిలీల్లో భాగంగా కలెక్టర్ వెంకట్రమణారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా గత డిసెంబరులో కలెక్టర్‌గా వచ్చారు. ఆయన తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని ఇంటికి వెళ్లి మరీ కలసి శాలువా కప్పి సత్కరించడంతో ప్రతిపక్షాల నమ్మకాన్ని కోల్పోయారు. ప్రతిపక్ష పార్టీల నేతల ఫిర్యాదుతో ఈసీ ఆయన్ను గత నెల 2వ తేదీన బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్‌ను కలెక్టర్‌గా నియమించింది. ఈసీ తీరు ఎలా వుందో ఈ ఘటన స్పష్టంగా వెల్లడించినా జిల్లాలో అధికారులు మాత్రం అప్రమత్తం కాలేదు.

అనుభవలేమితో ఎస్పీ తప్పటడుగు!

శాంతి భద్రతల నిర్వహణ, ఎన్నికల నిర్వహణల్లో తగిన అనుభవం, అవగాహన లేకపోవడంతోనే ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తప్పటడుగు వేసినట్టు తెలుస్తోంది. 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారైన ఈయన రంపచోడవరంలో అసిస్టెంట్ ఎస్పీగా, కర్నూలు జిల్లాలో సెబ్ ఏఎస్పీగా, విజయవాడలో లా అండ్ ఆర్డర్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. ఎస్పీగా తిరుపతిలోనే తొలి పోస్టింగ్. సరిగ్గా ఎన్నికల సమయంలో ఎస్పీగా విధులు చేపట్టడంతో తగిన అనుభవం, అవగాహన లేక కింది స్థాయి అధికారులపై ఆధారపడటం ఆయనకు చేటు చేసింది. అనుభవం, సమర్థత కలిగిన తదుపరి స్థాయి అధికారులు వున్నప్పటికీ వారిని పక్కనపెట్టి వారి కంటే కింది స్థాయిలో వున్న కొందరు అధికారులపై ఆధారపడ్డారని, అధికార పార్టీ నేతలతో అంటకాగుతున్న వారి సలహాలు, సూచనలతోనే విధి నిర్వహణలో విఫలమయ్యారన్న ప్రచారం జరుగుతోంది. 2014 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గంలో ఘర్షణలు జరగడం, 2019లో ఏడు చోట్ల రీ పోలింగ్ జరగడం వంటి గత చరిత్రను ఎస్పీ పూర్తిగా విస్మరించినట్టు కనిపిస్తోంది. దీనికి తోడు తిరుపతి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నాటి ఘర్షణలు, 2021 తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఉదంతాలూ పరిగణనలోకి తీసుకున్నట్టు లేదు. జిల్లాకు ఎస్పీగా వచ్చినపుడు ఇక్కడి గత చరిత్రను తెలుసుకుని దానికనుగుణంగా జాగ్రత్తలు తీసుకుని వుంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

మరోసారి గంగలో కలసిన జిల్లా పరువూ ప్రతిష్ఠ

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోరంగా విఫలమైన నాటి కలెక్టర్ భరత్ నారాయణ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ ఆవుల రమేష్‌రెడ్డిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో పలమనేరు డీఎస్పీ, శ్రీకాళహస్తి, పుంగనూరు సీఐలపైనా బదిలీ వేటు పడింది. తర్వాత తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఘటనలతో అప్పటి తిరుపతి మున్సిపల్ కమిషనర్ గిరీశా, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఇద్దరు సీఐలు, ఓ ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్, తిరుపతి అర్బన్ తహసీల్దారు, డిప్యూటీ తహసిల్దారు సస్పెన్షన్‌కు గురయ్యారు. తాజా ఎన్నికల్లో తిరుపతి కలెక్టర్ లక్ష్మీశా కూడా బదిలీ వేటుకు గురయ్యారు. ఈ ఘటనలతో ఇప్పటికే దారుణంగా దెబ్బతిన్న జిల్లా పరువు ప్రతిష్ఠలు తాజాగా ఈసీ ఆదేశాలతో మరింతగా గంగ పాలయ్యాయి.

తిరుపతి ఎమ్మెల్యే బహిరంగంగా బెదిరించినా..

తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పోలింగ్‌కు రెండు రోజులు ముందు జీవకోనలో ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా ఆంధ్రజ్యోతి ప్రతినిధులను బెదిరించారు. మళ్లీ అధికారంలోకి వస్తే అంతు చూస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఇదిఉల్లంఘించడమే అయినా పోలీసులు స్పందించలేదు. జర్నలిస్టు సంఘాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బెదిరింపులు మళ్లీ కొనసాగుతుండడంతో మరోసారి ఎస్పీ దృష్టికి తెచ్చేందుకు సం ఘాలు యత్నించినా కనీసం కలిసేందుకు కూడా ఆయన అవకాశం ఇవ్వలేదు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ


- శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు



తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు మొదలై చాలా రోజులైనప్పటికీ ఎన్నికల కారణంగా కొండపై రద్దీ తక్కువగానే కనిపించింది. వారాంతాల్లో మినహా మిగిలిన రోజుల్లో చాలా సాధారణంగా ఉంది. రాజకీయ నాయకులు కూడా ఎన్నికల ప్రచారంలో నిమగ్నం కావడంతో వీఐపీ బ్రేక్‌లో కూడా వీఐపీలు తక్కువగా కనిపించారు. ఈనెల 13వ తేదీతో పోలింగ్ ప్రక్రియ పూర్తవడంతో ఇటు సాధారణ భక్తులు, అటు వీఐపీలు తరలివస్తున్నారు. దీంతో గురువారం సాయంత్రం నుంచి రద్దీ భారీగా పెరిగింది. శ్రీవారి ఆలయం, మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, లడ్డూకౌంటర్ వంటి ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రద్దీ పెరిగిన నేపథ్యంలో గదుల కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరుతున్నారు. కల్యాణకట్టల్లోనూ రద్దీ అధికంగా ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలో షెడ్లు నిండిపోవడంతో సర్వదర్శన భక్తులకు 24 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ మైకుల ద్వారా ప్రచారం చేస్తోంది.

ప్రదక్షిణ చేయనీయకుండా గేట్లు?

రద్దీ పెరిగిన క్రమంలో చాలా మంది భక్తులు కనీసం ఆలయ నాలుగు మాడవీధుల్లో ప్రదక్షిణ చేసి, అఖిలాండం వద్ద కొబ్బరికాయాలు కొట్టి వెళ్లిపోతుంటారు. అయితే రద్దీ పెరిగిందనే పేరుతో దక్షిణ మాడవీధిలోని మూవింగ్ బ్రిడ్జి వద్ద ఉన్న గేటును మూసివేసి భక్తులకు ప్రదక్షిణ చేసే అవకాశం కూడా లేకుండా చేశారు. దాంతో ఇటు స్వామి దర్శనం లభించక, అటు గుడి చుట్టూ ప్రదక్షిణ కూడా చేసే అవకాశం లేకపోవడంతో చాలా మంది భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పైగా మూవింగ్ బ్రిడ్జి సమీపానికి చేరుకునేవారితో అక్కడున్న భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించారంటూ పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు.



దక్షిణ మాడవీధిలో భక్తులు ప్రదక్షిణ చేయడానికి వీల్లేకుండా పెట్టిన గేట్

పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో 13 మంది అరెస్టు

- కడప సెంట్రల్ జైలుకు నిందితుల తరలింపు

తిరుపతి(నేరవిభాగం), మే 16: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో మొత్తం 13మందిని అరెస్టు చేశారు. నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ని మంగళవారం సాయంత్రం పరిశీలించి వస్తున్న నాని, అతని గన్‌మేన్ ధరణిపై వైసీపీ శ్రేణులు సమ్మెటలు, రాడ్లు, రాళ్లు, కర్రలు, బీరు బాటిళ్లతో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో నాని చేతికి బలమైన గాయమవగా, గన్‌మేన్ కంటిపై తీవ్ర రక్తగాయమైంది. ఈ ఘటనపై ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు, ఎన్నికల కమిషన్‌కూ నానీ ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్లడంతో వర్సిటీ సీఐ మురళీమోహన్‌రావు నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, గాలింపు చర్యలు వేగవంతం చేశారు. సంఘటన జరిగిన రోజునే ఏడుగురిని రోజు అదుపులోకి తీసుకోగా, మిగిలిన ఆరుగురిని బుధవారం రాత్రి పట్టుకుని విచారించారు. గురువారం వీరిని అరెస్టు చూపారు. నిందితులపై హత్యాయత్నానికి పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. కాగా, 13 మంది నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన తిరుపతి డీఎస్పీ సురేంద్ర రెడ్డి, సీసీఎస్ డీఎస్పీ రవికుమార్, ఎస్వీయూ సీఐ మురళీమోహన్‌రావు, ఎస్‌ఐ రామాంజనేయులు, అంజనప్ప, ఐడీ పార్టీ సిబ్బంది ఏఎస్‌ఐ దామోదర్, మోహన్‌బాబు, ఈశ్వర్, సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ అభినందించి, రివార్డులు ప్రకటించారు.

నిందితుల వివరాలిలా..

ప్రధాన నిందితుల్లో రామచంద్రాపురం మండలం దిగువ రామాపురానికి చెందిన జడ్పీటీసీ భర్త వల్లేటి భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డి ఉండగా, మిగిలిన వారిలో.. దిగువ రామాపురానికి చెందిన ముదిపల్లి జానకిరెడ్డి, జానయ్యగారి జయచంద్రా రెడ్డి, పొదలకూరు కోదండమ్, బొక్కిసం చిరంజీవి, దండు పుష్పకాంత్ రెడ్డి, అదే మండలం గడ్డక్రింద పల్లికి చెందిన ఎద్దల భాస్కరరెడ్డి, కామసాని సాంబశివా రెడ్డి, తిరుమల బాలాజీ నగర్‌కు చెందిన అప్పన్నగారి సుధాకరరెడ్డి, తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లిలో కాపురమున్న వి.హరికృష్ణ, తిరుమల బాలాజీనగర్‌కు చెందిన పసుపులేటి రాము, రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన గోగుల కోటయ్య ఉన్నారు.

మృత్యుఒడికి ముగ్గురు అక్కా చెల్లెళ్లు

- దీపాలు వదులుతూ చెరువులో జారిపడి మృతి



గూళూరు చెరువు

విలపిస్తున్న తల్లి విజయ



రూపిక, చరిత, యాషిక మృతదేహాలు

వడమాలపేట, మే 16: దీపాలు చెరువులో వదులుతుండగా ప్రమాదవశాత్తూ ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృత్యువాత పడ్డారు. వివరాలివి. వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన బాబు, విజయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రూపిక(10) 5వ తరగతి, చరిత(13) 9వ తరగతి, యాషిక(ఇంటర్మీడియట్) చదువుతున్నారు. బాబు గ్రామంలో ఆర్ఎంపీగా ప్రాక్టీస్ చేస్తారు. గురువారం అతను మహాశివుని దర్శనార్థం తమిళనాడులోని తిరువణ్ణామలై వెళ్లారు. భార్య విజయ తన కుమార్తెలతో దిగువ గూళూరు వద్ద శివాలయంలో పూజ చేయడానికి వెళ్లింది. ఆమె పూజ చేస్తుండగా.. గూళూరు చెరువులో దీపాలు వదలడానికి ముగ్గురు అక్కాచెల్లెళ్లు వెళ్లారు. మెట్లమీద కూర్చొని దీపాలు వదులుతుండగా రూపిక జారి పడింది. వెంటనే కాపాడడానికి ప్రయత్నిస్తూ ఇద్దరు అక్కాచెల్లెళ్లు చెరువులో దూకారు. వీరి అరుపులు, కేకలు విని సమీపంలోని స్థానికులు వెళ్లారు. కానీ అప్పటికే ముగ్గురూ చెరువులో మునిగి చనిపోయారు. తల్లి విజయ చెరువు దగ్గర కన్నీరుమున్నీరైంది. ముగ్గురి మృతదేహాలను గ్రామస్తులు బయటకు తీశారు. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు.

శోకసంద్రంలో ఎస్‌బీఆర్ పురం

అక్కాచెల్లెళ్ల మృతి సంఘటనతో ఎస్‌బీఆర్ పురం గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. పుత్తూరు ప్రభుత్వాస్పత్రి పరిసరాలు కుటుంబీకులు, బంధువుల రోదనలతో నిండిపోయాయి. ముగ్గురు కుమార్తెలనూ కోల్పోయిన తల్లి విజయను ఓదార్చడం ఎవరి తరమూకాలేదు. పెద్దకుమార్తె యాషిక ఇంటర్‌లో 990 మార్కులు సాధించింది. అప్పు చేసి.. తిరుపతిలోని ప్రైవేటు కళాశాలలో చదివించారని స్థానికులు చెబుతున్నారు.




ఓటమి భయంతోనే వైసీపీ దాడులు

రఘురామకృష్ణరాజు

రేణిగుంట, మే 16: ఓటమి భయంతోనే కూటమి నాయకులపై వైసీపీ దాడులకు పాల్పడుతోందని పశ్చిమగోదావరి జిల్లా ఉండి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజు విమర్శించారు. గురువారం తిరుపతి విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్, సజ్జల మాటల్లో ధ్వనిస్తున్న వణుకు వారి ఆందోళనను చాటుతోందన్నారు. వారి ముఖ కవళికలు చూస్తే స్పష్టంగా ఓటమి అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో ఈ 15రోజులూ కేడర్‌లో జోష్‌ను నింపేందుకు 150 స్థానాలు స్థానాలు గెలుస్తున్నామని వైసీపీ నేతలు చెబుతూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్నారు. కూటమి 1994లో కన్నా 130, 135 స్థానాలు విజయం సాధిస్తుందన్నారు. 150 స్థానాలు సాధించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ఆయన చంద్రగిరి కూటమి అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శించేందుకు వెళ్లారు.

కారు దగ్ధం



తిరుపతి(నేరవిభాగం), మే 16: ఓ కారు దగ్ధమైన సంఘటన తిరుపతి గరుడ సర్కిల్‌లో జరిగింది. నంద్యాల జిల్లా బనగానపల్లెకి చెందిన ఎం.శ్రీనివాస రెడ్డి కుటుంబీకులతో తిరుమలకు వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం కారులో గురువారం తిరుపతికొచ్చారు. అనంతరం మోహన్ బాబు కాలేజీ వద్దకెళ్లి అక్కడ తెలిసిన వారితో మాట్లాడి జూ పార్కు రోడ్డులో తిరుపతికి బయల్దేరారు. అలిపిరి గరుడ సర్కిల్ సమీపానికి వచ్చేసరికి కారు ఇంజిన్ వేడెక్కి, ఉన్నట్టుండి బ్యాటరీల నుంచి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై వాహనంలోని వారిని దింపేయడంతో పెను ప్రమాదం తప్పింది. తాము వెళ్లేసరికే కారు చాలా వరకు దగ్ధమవగా, రూ.3లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

ఎవరు గెలుస్తారు...

ఎక్కడ చూసినా ఇదే చర్చ

తడ, మే 16: ఎవరు గెలుస్తారు... ఎవరికి అధికారం దక్కుతుంది.. ఎవరికి మెజార్టీ వస్తుంది.. ఇది ఏ ఇద్దరు, ముగ్గురు కలసినా చర్చించుకుంటున్న మాటలు. ఏ దుకాణం, టీ అంగళ్ల వద్ద ఈ తరహా చర్చలు జరుగుతున్నాయి. సోమవారం పోలింగ్ ముగిసింది. ప్రజల తీర్పు ఈవీఎంలలో భద్రంగా ఉంది. వీటిని లెక్కించి విజయం ఎవరిని వరించిందో తెలుసుకునేందుకు మరో 20 రోజుల సమయం ఉంది. అయితే ఈ విజయంపై పట్టణాల్లో, గ్రామాల్లో ఎక్కడ చూసినా చర్చ నడుస్తోంది. ఫలాన అభ్యర్థికి ఆ ఊరిలో ఓట్లు ఎక్కువ పడ్డాయని, ఈ వీధిలో తక్కువపడ్డాయని, వీరికి ఇక్కడ మెజార్టీ వస్తుందని ఇలా రకరకాలుగా చర్చించుకుంటున్నారు. ఖచ్చితంగా ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని వాదనలు సైతం జరుగుతున్నాయి. ఎన్నికల ప్రచారాన్ని పెద్దగా పట్టించుకోని ప్రజలు ఓటు వేసిన తరువాత వచ్చే ప్రభుత్వం గెలుపొందే ప్రజా ప్రతినిధులపై ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈ మేరకు ఎక్కడ చూసినా ఇటువంటి చర్చలే నడుస్తున్నాయి. మరో 20 రోజులు ఆగితేగాని ఈ ఫలితాలు వెలువడే ఆస్కారం లేకపోవడంతో ఈ చర్చలు ఇలాగే కొనసాగే అవకాశం ఉంది.

హింసాత్మక ఘటనలకు పాల్పడొద్దు

బాలాయపల్లి, మే16: హింసాత్మక ఘటనలకు తావివ్వద్దంటూ గురువారం టీడీపీ నేత, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సి.సి.నాయుడికి బాలాయపల్లి పోలీసులు నోటీసులు అందజేశారు. పోలీసుల వివరాల మేరకు... మండలంలో వైసీపీ నాయకురాలు దేవికా చౌదరికి, టీడీపీ నేత సీ.సీ. నాయుడుకి సెక్షన్ 149 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేయమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈక్రమంలో సీసీ నాయుడుకి నోటీసులు అందజేశాకె. వైసీపీ నాయురాలు దేవికా చౌదరి అందుబాటులో లేకపోవడంతో నోటీసులు ఇవ్వలేదని ఎస్‌ఐ మహబూబ్ సుభాని తెలిపారు. తిరుపతి జిల్లాలో ఎన్నికల అనంతరం తలెత్తిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో బాలాయపల్లి మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. తదుపతి ఉత్తర్వులు వెలువడే వరకు ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టరాదన్నారు.

నేటినుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు



ఆహ్వాన ప్రతులను ఆవిష్కరిస్తున్న కమిటీ

సూళ్లూరుపేట, మే 16: సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డులో ఉన్న విరాట్ పోతులూరు వీర బ్రహ్మేంద్రస్వామి మఠంలో ఈనెల 17న శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు ఆరాధన ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని కమిటీ అధ్యక్షుడు చిట్టేటి పెరుమాల్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మఠం వద్ద ప్రచార కరప్రతులను ఆవిష్కరించారు. యేటా నిర్వహించే ఆరాధన ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం గణపతి పూజ, హోమం, గోపూజతో ప్రారంభమవుతుందన్నారు. 18. స్వామి వారి కల్యాణం, రాత్రి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 19న సుదర్శన హోమం, స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. కమిటీ సభ్యులు ఎస్.వి.రమ ణయ్య, గిరిఆచారి, బట్టా సుబ్రమణ్యం యాదవ్, సీహెచ్ రామదాస్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ



రామచంద్రారెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు

చిల్లకూరు, మే 16: పోలింగ్ సందర్భంగా ఎస్‌ఐ దాడి చేయడంతో గాయపడిన టీడీపీ నాయకుడు కొండా రామచంద్రారెడ్డిని ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు గురువారం చిల్లకూరులోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా వరప్రసాద రావు మాట్లాడుతూ చిల్లకూరులో పోలింగ్ రోజున జరిగిన వివాదంలో ఎస్‌ఐ అంజిరెడ్డి అత్యుత్సాహాన్ని ప్రదర్శించడం మంచిపద్ధతి కాదన్నారు. కేసును పక్కదారి పట్టించేలా చూస్తున్నారన్నారు. టీడీపీ నాయకులపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై కూడా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పట్టాభిరామిరెడ్డి, బిందురెడ్డి, పురుషోత్తంరెడ్డి, దినేష్, శ్రీనివాసులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి టీడీపీ అండ



గోపాల్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పాశిం , గంగాప్రసాద్

చిల్లకూరు, మే 16: వైసీపీ నాయకుల దాడిలో తీవ్ర గాయాలపాలైన టీడీపీ నాయకుడు గోపాల్ కుటుంబానికి టీడీపీ అన్నివిధాలా అండగా ఉంటుందని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్‌తో కలిసి చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న గోపాల్‌ను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పాశిం మాట్లాడు తూ... వైసీపీ నాయకులు దాడు లకు దిగడం, దౌర్జన్యాలకు పాల్ప డడం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నికల సందర్భంగా టీడీపీ నాయకులపై దాడులను ఖండిస్తు న్నామన్నారు. కార్యకర్తలకు అండ గా నిలుస్తామన్నారు. కార్యక్ర మంలో తానంకి నానాజీ, వెంక టేశ్వర్లురెడ్డి, జి.కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

దోషులపై చర్యలు తీసుకోండి

బాలాయపల్లి, మే16: వెంకట గిరి పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి వారిపై వెంటనే చర్యలు తీసుకో వాలని ఏపీ ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ పోరాట సమితి వ్యవ స్థాపక అధ్యక్షుడు కె.ఆర్. దాసరి డిమాండ్ చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

సూళ్లూరుపేట, మే 16: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. లయన్స్ క్లబ్ సభ్యుడు సుబ్రమణ్యం రెడ్డి దంపతులు పెళ్లిరోజు పురస్కరించుకొని అన్నదానం నిర్వహించామని క్లబ్ అధ్యక్షుడు ఆదిశేషా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీనివాస జెట్టి, కోశాధికారి అప్పారావు సభ్యులు పాల్గొన్నారు.

చంద్రుడి చుట్టూ ఉన్న వలయాకారం

మంచి వర్షాలకు సూచన అంటున్న రైతులు



గూడూరు అర్బన్, మే 16: ఆకాశంలో గురువారం రాత్రి చంద్రగుడి కన్పించింది. వేసవిలో చంద్రుడు చుట్టూ ప్రకాశంతమైన వలయాకారం ఏర్పడితే దాన్ని పెద్దలు చంద్రగుడిగా చెబుతుంటారు. ఈ సమయంలో చంద్రుడు శక్తివంతంగా ఉండడంతో ఆ ప్రకాశం కొన్నిరెట్లు అధికంగా ఉంటుందంటున్నారు. ఇది మంచి వర్షాలకు సూచికగా నిలుస్తుందని పెద్దలు, రైతులు అంటున్నారు.

ఆశాజనకంగా పెసర ధరలు... ఆనందంలో రైతులు





నూర్పిడికి సిద్ధం చేసి ఉన్న పెసర - దెబ్బతినకుండా కుప్పగా వేసి ఉన్న పెసర

కోట, మే 16: ఈ ఏడాది పెసర ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతుల ఆనందాలకు అవధుల్లేవు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల డెల్టా రైతులు ఫిల్టర్ పాయింట్ల కింద హైబ్రిడ్, నాటు రకం పెసరను సాగు చేశారు. ఎడగారు వరి సాగు ప్రారంభమైన నేపథ్యంలో పొలాల్లో చివరి దశలో ఉన్న పెసర పంటను రైతులు కోసి నూర్పిళ్లు చేస్తున్నారు. మండల పరిధిలోని తిన్నెలపూడి, వంజివాక, కేశవరం, చిట్టేడు, ఊనుగుంట పాళెం, రుద్రవరం, రాజుపాళెం తదితర గ్రామాల్లో పెసర నూర్పిడి జోరుగా సాగుతోంది. ఈ ఏడాది ఎకరానికి 4 నుంచి 5 బస్తాలు దిగుబడులు వస్తున్నాయి. గతంలో 3 నుంచి 4 లోపే దిగుబడులు వచ్చేవి. 100 కిలోల నాటు పెసర రూ.11వేల వరకు పలుకుతోంది. గుంటూరు, చీరాల తదితర ప్రాంతాల్లో ఇక్కడ పండించిన పెసరకు డిమాండ్ ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పెసరకు డిమాండ్ ఉండటం, ధరలు పెరగడటంతో ఆయా ఫిల్టర్ పాయింట్ల కింద సాగు చేసే రైతులంతా పెసరవైపే మొగ్గు చూపుతున్నారు.

పోలేరమ్మ జాతర చాటింపు వేశారు... ముఖం చాటేస్తున్నారు!



పోలేరమ్మ ఆలయం

నాయుడుపేట టౌన్, మే 16: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతర యేటా మే మాసంలో నిర్వహించడం ఆనవాయితీ. ఎన్నికల నోటిఫికేషన్‌తో పాలకమండలి రద్దు కావడం, దేవదాయ శాఖ పర్యవేక్షణలోకి గ్రామదేవత పోలేరమ్మ జాతర వెళ్లింది. జాతరను మే 28, 29 తేదీల్లో నిర్వహించేలా ఏప్రిల్‌లో చాటింపు వేశారు. ఎన్నికలు పూర్తికావడంతో జాతర కోసం పోలేరమ్మ భక్తులు ఎదురు చూస్తున్నారు. అయితే గత పాలకమండలిలో తలెత్తిన వర్గ విబేధాలు ఈ జాతరపై ప్రభావం చూపుతున్నాయి. పేరుకు దేవదాయశాఖ పర్యవేక్షణలో జాతర జరుగుతుందన్న మాటేకాని నిర్వహణ అంతా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోనే కొనసాగుతుందనేది జగమెరిగిన సత్యం. గ్రామదేవత హుండీ లెక్కింపు సమయంలో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అమ్మవారి ఖాతాలో జమ అవుతుంది. అయితే ఈ నగదు మంచి నీళ్లప్రాయంగా ఖర్చు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. జాతర ఏర్పాటు కోసం ఒక్కసారి చాటింపు వేసి నిలిపివేస్తే గ్రామానికి అరిష్టమన్న ఆవేదన భక్తుల్లో వ్యక్తమవుతోంది. ఇకనైనా దేవదాయశాఖ అధికారులు ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం పోలేరమ్మ జాతరను నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు అంతులేకుండా పోతోంది



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌రావు

గూడూరు, మే 16: రాష్ట్రంలో వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు అంతు లేకుండా పోయిందని బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌రావు అన్నారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి అభ్యర్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ పాలన అవినీతిమయంగా సాగిందన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నా రన్నారు. చిల్లకూరు మండలంలో సిలికా అక్రమ రవాణ కారణంగా పేదలు వ్యవసాయ భూములు, నివాసాలు కోల్పోతున్నారన్నారు. ఈ విషయాన్ని పలుసార్లు సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే సిలికా అక్రమ రవాణాను అరికడతామన్నారు. ఎన్నికల సందర్భంగా చిల్లకూరు మండలంలో వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై దాడి చేయడం అమానుషమన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసులు, ఏ.బాలకృష్ణమనాయుడు, బి.చెంచురామయ్య, వెంకటేశ్వర్లు రాజు, పి.పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ



అత్తివరం , పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన అవగాహన ర్యాలీలు

ఓజిలి, మే 16: మండలం అత్తివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం జాతీయ డెంగ్యూ దినం సందర్భంగా గ్రామంలో వైద్యఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా సిబ్బంది డెంగ్యూపై అవగాహన కల్పించేలా నినాదాలతోపాటు గ్రామంలోని పలు కూడళ్ల వద్ద ప్రజలకు ఆరోగ్య సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో అత్తివరం వైద్యాధికారి మోహనరంగ, ఎంపీహెఈవో రాజగోపాల్, హెల్త్ ఎడ్యుకేటర్ సుభాషిణి, ఎంపీహెచ్‌ఏ సుకుమారి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చిల్లకూరు: జాతీయ డెంగీ దినం సందర్భంగా డెంగ్యూ నివారణపై అవగాహన కల్పిస్తూ చిల్లకూరులోని పలు వీధుల్లో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు తేజశ్వని, గీతావాణి మాట్లాడుతూ... దోమలు ఉత్పత్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా, పరిశుభ్రంగా ఉంచుకునేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమ తెరలను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, తహసీల్దారు భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మెహబూబీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని పెళ్లకూరు, చెంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గురువారం జాతీయ డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. దోమలు ప్రబలకుండా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు.

జర్నలిస్టులు రాజకీయ ప్రత్యర్థులు కాదు

వ్యక్తిగత దాడులు ఇక ఆపండి భూమనా ● అలిపిరి సీఐపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన

తిరుపతిలో ప్రజాసంఘాలు, జర్నలిస్టుల హెచ్చరిక



అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 16: వ్యతిరేక వార్తలు రాసిన జర్నలిస్టులపె వ్యక్తిగత నిందారోపణలు చేయడాన్ని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తక్షణం మానుకోవాలని జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. రాజకీయ నాయకులకు జర్నలిస్టులు ప్రత్యర్థులు కాదని గుర్తుంచుకోవాలన్నారు. నాయకులపై చేసినట్లుగా వ్యతిరేక వార్తలు రాసిన జర్నలిస్టులమీద ఆరోపణలు చేయడం నీచ సంప్రదాయం అన్నారు. మహిళా విశ్వవిద్యాలయంలో జర్నలిస్టులమీద లాఠీచార్జి చేయించిన అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిని తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సభలో సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ మాట్లాడుతూ, ప్రభుత్వాల వైఫల్యాలను, అవినీతిని ప్రజలకు తెలియజేయడమే పత్రికల బాధ్యత అని, దాడులు చేయడం అన్యాయమని అన్నారు. న్యాయవాది సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ, బహిరంగ సభలో భూమన చేసిన వ్యాఖ్యల వల్ల జర్నలిస్టులపై మూకదాడులు జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. మీడియా స్వేచ్ఛకు భంగం కల్గించే చర్యలపై గవర్నర్‌ను కలిసి విన్నవిస్తామన్నారు. హైకోర్టును కూడా ఆశ్రయిస్తామన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి మాట్లాడుతూ, జర్నలిస్టుల పట్ల ఈ తరహా ఆరోపణలు చేయడం భూమన స్థాయికి తగదన్నారు. ఏఐటీయూసీ నేత చంద్రశేఖర్ మాట్లాడుతూ, మీడియా గొంతు నొక్కే చర్యలను ఎవ్వరూ ఉపేక్షించకూడదన్నారు. సీఐటీయూ నేత బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, దాడుల సంస్కృతిని ప్రోత్సహించేలా భూమన వ్యాఖ్యలు ఉన్నాయని, తిరుపతి ప్రజలు, మేధావులు, రచయితలు దీనిని ఖండించాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే మాజీ కార్యదర్శి దినేష్‌కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల ఐక్యతను భగ్నం చేసేలా భూమన మాట్లాడుతున్నారని, దాడులు చేసేలా వ్యాఖ్యలు చేయడం గాక జర్నలిస్టుల మనసుల్లో స్థానం సంపాదించుకోవాలని హితవు చెప్పారు.

చర్యలు తీసుకోండి

టీడీపీ లీగల్ సెల్ నేత వెంకటరమణ మాట్లాడుతూ, జర్నలిస్టులను బెదిరించినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రచయిత కోట పురుషోత్తం మాట్లాడుతూ, సహృదయుడైన ఉమామహేశ్వరరావు వంటి వారిపై భూమన కరుణాకర రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం తనకు చాలా బాధ కల్గించిందన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ, ప్రజా పోరాటాలకు అండగా నిలిచే పత్రికలకు, జర్నలిస్టులకు ప్రజా సంఘాలు తప్పక అండగా నిలుస్తాయన్నారు. సీఐ రామచంద్రారెడ్డి వైసీపీ కార్యకర్తలా మారిపోయారని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నేత దినకర్ ఆరోపించారు. రాబోయే 15 రోజుల్లో వైసీపీ నాయకుల దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందనీ, ఇదంతా ఓటమి భయంతో జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. భూమన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని హమాలీ యూనియన్ నేత ఎన్‌డీ రవి డిమాండ్ చేశారు. భూమన రాజకీయ ఎదుగుదలలో పత్రికల పాత్ర లేదా అంటూ, ఇంత దిగజారి జర్నలిస్టులపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బండి చలపతి విమర్శించారు. చేతనైతే జర్నలిస్టులపై చేసిన ఆరోపణలను నిరూపించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) కార్యదర్శి చిన్నం కాళయ్య కరుణాకరరెడ్డిని సవాల్ చేశారు.

పదునెక్కిన అక్షరం భయపెడుతుంది

అక్షరం ఎంత పదునైనదో, ఎంత శక్తివంతమైనదో, ఎంత విస్ఫోటనం కలిగించగలతో భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్‌ఎం ఉమామహేశ్వరరావు అన్నారు. జర్నలిస్టుల మీద వ్యక్తిగత ఆరోపణలు చేసే దుస్సాంప్రదాయాన్ని భూమన మొదలు పెట్టారని అన్నారు. ఎప్పటికైనా భూమన తన అంతరాత్మకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. దయచేసి ఇక్కడితో ఆరోపణలు ఆపేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రెస్‌క్లబ్ కోశాధికారి శ్రీకాంత్, తిరుపతి స్థానిక హక్కుల సంఘం నేత భాస్కర్, టీఎన్‌ఎస్‌ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, ఏపీయూడబ్ల్యూజే మాజీ కార్యదర్శి గిరిధర్, ఆంధ్రనాడు పత్రిక ఎడిటర్ హరిబాబు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నేత కాళహస్తి గిరిబాబు, జర్నలిస్టు కోలా లక్ష్మీపతి సభలో భూమన వ్యాఖ్యలను ఖండిస్తూ, సీఐ రామచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రసంగించారు.

ఏపీటీడబ్ల్యుఆర్ పాఠశాలలో ఖాళీలు

దరఖాస్తులకు ఆహ్వానం

గూడూరు అర్బన్, మే 16: స్థానిక మాళవ్యానగర్‌లోని ఏపీటీడబ్ల్యుఆర్ పాఠశాలలో బాలికలకు సంబంధించి 2024-25 విద్యాసంవత్సరానికి ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. 3వ తరగతిలో 40, 4వ తరగతిలో 35, 5వ తరగతిలో 30, 6వ తరగతిలో 7, 7వ తరగతిలో 3 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోపు అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ నెం.8333925187, 8885372878, 9441596331లలో సంప్రదించాలన్నారు.

గూడూరులో మారిన వాతావరణం

గూడూరు అర్బన్, మే 16: గత కొద్దిరోజులుగా ఎండతీవ్రతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పట్టణంలో ఆకాశం మేఘావృతమై ఎండ వేడిమి తగ్గడంతో వాతావరణంలో చోటుచేసుకుంది. ఎండ తీవ్రత కారణంగా ఉక్కపోతకు అల్లాడిపోయిన ప్రజలు వాతావరణం చల్లబడడంతో సేద తీరారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



సర్వసభ్య సమావేశంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ, ఎంపీడీవో, తహసీల్దారు

చిల్లకూరు, మే 16: మండలంలోని తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వెంకటరమణమ్మ చెప్పారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిల్లకూరు, చింతవరం గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. అధికారులకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారు కళాశాలలో చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెంగయ్య, ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో భానుమూర్తిరావు, తహసీల్దారు భాగ్యలక్ష్మి, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు ప్రారంభం



కోట, మే 16: మండల పరిధిలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో గురువారం డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కోట, విద్యానగర్‌లలోని డిగ్రీ విద్యార్థులకు ఇక్కడ పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రంలో 242 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం సెమ్-2 పరీక్షలు ప్రారంభమై జూన్ మొదటి వారం వరకు కొనసాగనున్నాయి.

తాగునీటి పైపు లీకేజీ



తోలిమిట్ట వద్ద లీకేజీ అవుతున్న వాటర్ పైపు

వెంకటగిరిటౌన్, మే 16: మున్సిపాలిటీ పరిధిలోని బంగారుపేట, ఎన్టీఆర్ కాలనీ, తోలిమిట్ట, గొల్లపాళెం, పీర్లాతి పేట, మాసాపేట ప్రాంతాల్లో తాగునీరు పైపు లీకేజీలు అవుతున్నాయి. గత ఇరవై రోజులుగా తాగునీరు వృథా అవుతున్నా మున్సిపాలిటీ సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో పలు వార్డుల్లో తాగునీటి సమస్య జటిలమవుతోంది. సమస్య పరిష్కరించకపోవడంతో వార్డు ప్రజలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైనను మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాల్సి ఉంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.90 కోట్లు

తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.90 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 81,930 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 41,224 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు

స్వల్పగాయాలతో బయటపడిన మహారాష్ట్ర భక్తులు



ప్రమాదానికి గురైన కారు

తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మహారాష్ట్రలోని సంగ్లీకి చెందిన ఐదుగురు భక్తులు శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు వచ్చారు. దర్శనానంతరం తమ కారులో గురువారం ఉదయం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలోని ఓ మలుపు వద్ద కారు అదుపుతప్పి కుడివైపునున్న చిన్నగట్టును ఢీకొని అడవిలోకి దూసుకెళ్లి, ఓ చెట్టును ఢీకొని ఆగింది. అదృష్టవశాత్తూ ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో వాహనంలోని ఐదుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును తిరుపతికి తరలించారు.